ప్రజాశక్తి

బుధవారం 6 మార్చి 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు





వేదికపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్, అచ్చెన్నాయుడు, లోకేశ్ తదితరులు... సభకు హాజరైన శ్రేణులు

టిడిపిలో జోష్

- జయహో బిసి సదస్సుకు భారీగా తరలివెళ్లిన కార్యకర్తలు
- డిక్లరేషన్‌తో వెనుకబడిన తరగతుల్లో చర్చ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట మంగళశారం సాయంత్రం నిర్వహించిన జయహో బిసి సదస్సుకు టిడిపి కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరవడం నాయకుల్లో ఉత్సాహాన్ని నింపింది. గుంటూరు నుంచి టిడిపి నాయకులు పెమ్మసాని చంద్రశేఖర్, నశీర్ అహ్మద్, కోవెలమూడి రవీంద్ర, గల్లా మాధవి ఆధ్వర్యంలో టిడిపి కార్యకర్తలు, అభిమానులు సదస్సుకు తరలివెళ్లారు. బిసి డిక్లరేషన్‌లో రూపొందించిన అంశాలు కూడా చర్చనీయాంశంగా మారాయి. బిసిల్లో 50 ఏళ్ల నిండిన పేదలకు పింఛన్లు ఇస్తామని డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ పలువురిని ఆకట్టుకుంది. ప్రస్తుత ప్రభుత్వంలో రద్దయిన పథకాల పునురుద్ధరణ, సబ్‌ప్లాన్ ద్వారా ఐదేళ్లలో రూ.1.50 లక్షల కోట్లు ఖర్చుతో పాటు 10 అంశాలతో కూడిన డిక్లరేషన్‌ను చంద్రబాబు, పవన్ కల్యాణ్ విడుదల చేశారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు, ఇద్దరుకు మించి పిల్లలున్నా రిజర్వేషన్లు వర్తింపజేస్తామని చేసిన ప్రకటన ద్వితీయ శ్రేణి నాయకుల్లో ఉత్సాహాన్ని నింపింది. చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్లకు కృషి చేస్తామని చంద్రబాబు హామీ ఇవ్వడం నియోజకవర్గం స్థాయిలో నాయకుల్లో ఆశలు రేకెత్తించింది. బిసి యువతకు రూ.10 వేల కోట్లతో నిధి ఏర్పాటు చేసి పరిశ్రమల ఏర్పాటుకు, ఆధునిక పనిముట్లు అందిచేందుకు కృషి చేస్తామని డిక్లరేషన్‌లో పేర్కొన్నారు. పీజీ విద్యార్థులకు ఫీ రీయింబర్స్‌మెంట్ పునరుద్ధరణ, స్టడీ సర్కిల్, విద్యోన్నత పథకాలను తిరిగి ప్రారంభిస్తామన్నారు. శాశ్వత కుల ధ్రువీకరణ ఇవ్వడం ద్వారా బిసి దశ దిశామార్చుతామని చంద్రబాబు ప్రకటించారు. చెరువులు, దోభీ గాట్లపై రజకులకు ఉన్న హక్కులను పునర్దురిస్తామని, దోభీ ఘాట్లకు 200 యూనిట్లు ఉచితంగా

2లో

పంచాయతీల సమస్యలపై కలెక్టరేట్ ఎదుట ధర్నా

7లో



దీక్షలకు సంఘీభావంగా మాట్లాడుతున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు

పరిహారం దక్కే వరకూ పోరాటం

- ప్రత్యక్ష ఆందోళనలోనూ పాల్గొంటాం
- రాజకీయాలకు అతీతంగా అందరం మద్దతుగా నిలవాలి
- సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు
- పసుపు బాధిత రైతుల దీక్షలకు సంఘీభావం

ప్రజాశక్తి - దుగ్గిరాల

శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో అగ్ని ప్రమాదం జరిగి పసుపు పంటను నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందేవరకూ ఉద్యమం ఆగదని, ఇందుకు పార్టీలకు అతీతంగా అందరూ రైతులకు మద్దతుగా నిలవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. మండల కేంద్రమైన దుగ్గిరాలలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఐదు రోజులుగా జరుగుతున్న బాధిత రైతుల రిలేదీక్ష శిబిరాన్ని రామారావు మంగళవారం సందర్శించి సంఘీభావంగా మాట్లాడారు. రైతులకు జరిగిన నష్టాన్ని యజమాని నుండి కచ్చితంగా వసూలు చేయాలని, ఈ ఆందోళనలో తమ పార్టీ ప్రత్యక్షంగా పాల్గొంటుందని చెప్పారు. పెరిగిన ధరలకు అనుగుణంగా యజమాని బీమా చేయాల్సి ఉన్నా చేయలేదని, చట్ట ప్రకారం కోల్డ్ స్టోరేజీ యజమానిని బాధ్యునిగాచేసి పెరిగిన ధరల ప్రకారం రైతులకు నష్టపరిహారం యాజమాన్యం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు మద్దతు ధరలు లేని కారణంగానే కోల్డ్ స్టోరేజీల్లో పంటను దాచుకోవాల్సి వస్తోందని, అందుకే ప్రతిమండలంలోనూ కోల్డ్ స్టోరేజీలు వెలుస్తున్నాయని చెప్పారు. తాజా ఘటనలో బాధిత రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించకుంటే ఎన్నికల నేపథ్యంలో ఇదే అంశాన్ని జిల్లా అంతటా ప్రచారం చేస్తామని చెప్పారు. బాధిత రైతుల కమిటీ కన్వీనర్

2లో



క్వారీ తిరునాళ్లకు భారీబందోబస్తు

ఏర్పాట్లను పరిశీలించిన ఎస్‌పి తుషార్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

మహాశివరాత్రి సందర్భంగా చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ వద్ద జరిగే తిరునాళ్లకు తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను జిల్లా ఎస్‌పి తుషార్ దూడి ఆదేశించారు. క్వారీ తిరునాళ్ల జరిగే ప్రదేశాలను ఎస్పీ మంగళవారం పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యమూ కలగకుండా పోలీస్ అధికారులు భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. క్యూ లైనులను, బారీకేడ్లను పరిశీలించారు. విద్యుత్ ప్రభలు విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, గుంటూరు-తెనాలి మార్గంలో ట్రాఫిక్ సమస్య రాకుండా చూడాలని చెప్పారు. ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ బృందాన్ని నియమించాలన్నారు. తిరునాళ్లకు ఆయా గ్రామాల నుండి వచ్చే ప్రభలు నిలుపు కోవడానికి, సందర్శకుల వాహనాలను నిలుపుకోవడానికి పార్కింగ్ ప్రాంతాలను సూచించారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చూడటానికి పోలీస్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రత్యేక నిఘా బృందాన్నీ నియమిస్తున్నట్టు తెలిపారు. ఎస్పీవెంట తెనాలి డీఎస్పీ రమేష్‌బాబు, పొన్నూరు సిఐ కోటేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ సిఐ వెంకటరావు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

వృద్ధురాలి హత్య కేసులో ఇద్దరికి జీవితఖైదు

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

వృద్ధురాలి హత్య కేసులో ఇద్దరికి గుంటూరు నాల్గవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి శరత్‌బాబు ఇద్దరు నిందితులకు జీవితఖైదు, రూ.500 చొప్పున జరిమాన విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. గుంటూరు నగరం బృందావన్ గార్డెన్స్‌లోని అపోలో ఫార్మసీలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్న ఫిరంగిపురం మండలం పొనుగుపాడుకు చెందిన కొరివి అశోక్ ఆర్థిక అవసరాల నిమిత్తం అదే గ్రామానికి గేరా రాము అనే వ్యక్తిని కలుపుకొని ఇద్దరూ 2015 సెప్టెంబర్ 17న రాత్రి బృందావన్ గార్డెన్స్‌లోని సాయి టవర్స్ అపార్ట్‌మెంట్‌లో నివశిస్తున్న గర్నేని సుశీలాదేవి ఫ్లాట్‌కు వెళ్లారు. ఆమె ఒంటిపై ఉన్న బంగారం, ఇంట్లోని డబ్బు ఇవ్వాలని బెదిరించారు. ఆమె అంగీకరించకపోవటంతో ఆమె ముఖంపై దిండుపెట్టి హతమార్చారు. ఆమె ఒంటిపై, బీరువాలో ఉన్న బంగారు గాజులు, రెండుపేటల గొలుసు, రుద్రాక్ష దండ, పగడాల చైను, రెండు జతల చెవిదిద్దులు, నగదు దొంగిలించారు. మృతురాలు ఆస్తమా పేషెంట్ కావటంతో సహజ మరణంగా చిత్రీకరించేందుకు ఆమెను దివాన్‌కాట్‌పై పడుకోబెట్టి, పక్కనే ఇన్హేలర్ ఉంచి వెళ్లిపోయారు. ఘటన జరిగిన రోజు మధ్యాహ్నం సుశీలాదేవి కూతురు, అల్లుడు వినాయకచవితి సందర్భంగా ఆమెను పరామర్శించి వెళ్లారు. 18వ తేదీ ఉదయం సుశీలాదేవి ఇంట్లో పనిచేస్తున్న పనిమనిషి ఆమె ఇంటి బెల్ కొట్టినా డోరు తీయకపోవటంతో వాచ్‌మెన్, తర్వాత అపార్ట్‌మెంట్‌లోని నివాసితులు వచ్చి చూడగా డోరు తెరిచి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా ఆమె చనిపోయి ఉంది. ఈ విషయం అల్లుడికి తెలియటంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుల్ని గుర్తించి, అపహరించబడిన బంగారం, నగదు రికవరీ చేశారు. విచారణ అనంతరం కోర్టులో సిఐ శేషగిరిరావు చార్జిషీటు దాఖలు చేశారు. నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి పైమేర తీర్పు వెలువరించారు. కోర్టులో సాక్షుల్ని ప్రవేశపెట్టటంలో కోర్టు కానిస్టేబుల్ కసిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చొరవ చూపారు. ప్రాసిక్యూషన్ తరుపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నక్కా శరదామణి వాదించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, ఘనటా స్థలంలో మృతదేహం (ఇన్‌సెట్)

వృద్ధుడు దారుణ హత్య

స్వల్ప వివాదమే కారణం - సమీప బంధువుపైనే అనుమానం

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలో ఓ వృద్ధుడు దారుణ హత్యకు గురయ్యాడు. సమీప బంధువైన యువకుడిపైనే స్థానికులు, కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. ఐతానగర్‌లోని లంకెవానిదిబ్బ ప్రాంతానికి చెందిన చింతాబత్తుని ఫిలిప్ (62) తాపీ కార్మికుడు. ఆయన భార్య, కుమారుడు గతంలోనే మరణించగా ఒక కుమార్తె ఉన్నారు. ఫిలిప్ ఒంటరిగానే నివసిస్తుండగా కుమార్తె సమీపంలోనే ఉంటున్నారు. స్థానికులతో

2లో

నలుగురు గంజాయి విక్రేతలు అరెస్ట్

రెండు కిలోల సరుకు, నాలుగు బైక్‌లు స్వాధీనం

3 లో



బుల్లెట్‌పై సభకు వెళ్తున్న పెమ్మసాని చంద్రశేఖర్, నసీర్ అహ్మద్

టిడిపిలో జోష్

(మొదటి పేజీ తరువాయి)

కరెంటు ఇస్తే వైసిపి దీనిని రద్దు చేసిందన్నారు. పల్నాడు ప్రాంతంలో పలువురు బిసిలను వైసిపి నాయకులు హత్య చేశారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బిసిలంతా టిడిపిని ఆదరించాలని కోరారు.

మంగళగిరిలో ఉండే ప్రతి ఒక్కరికీ పూర్తి హక్కులు కల్పిస్తూ ఇంటి పట్టాలు ఇస్తామని, పేదలకు 20 వేల టిడ్కో ఇల్లు నిర్మిస్తామని, మంగళగిరి చేనేతకు ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చే విధంగా, ఆదాయం పెంచే కార్యక్రమాన్ని లోకేష్ చేశారని టాటా సంస్థ భాగస్వామ్యంతో వీవర్స్ శాల పెట్టి ఆదాయం రెట్టింపు చేశామని, స్వర్ణకారులకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని, తాడేపల్లి పరిధిలో యూ-1 ఎత్తేసి ఎవరి భూములను వారు అమ్ముకునేలా వీలు కల్పిస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు. రాబోయే ఎన్నికలు చాలా కీలకం. ఐదు కోట్ల భవిష్యత్తుకై పవన్, నేను పోరాడుతున్నామని, సూపర్-6 కింది మేనిఫెస్టోలో పథకాలన్నీ అమలు చేస్తామని ప్రకటించారు. బిసిలకు రక్షణ చట్టం అంశాన్నీ ప్రస్తావించారు. ఈసభలో జనసేన అధినేత పవన్ కల్యాణ్, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, కొల్లు రవీంద్ర, గుమ్మనూరు జయరాం, పితాని సత్యనారాయణ, ఎంపిలు లావు శ్రీకృష్ణదేవరాయులు, కె.రామ్మోహననాయుడు, ఎమ్మెల్సీలు పంచుమర్తి అనూరాధ,దువ్వారపు రామారావు, ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్, గుంటూరు లోక్‌సభ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, పత్తిపాటి పుల్లారావు, జీవీ.ఆంజనేయులు, కన్నా లక్ష్మీనారాయణ, తెనాలిశ్రావణ్‌కుమార్, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, కొమ్మాలపాటి శ్రీధర్, చదలవాడ అరందవిందబాబు, కోవెలమూడి రవీంద్ర, నశీర్ అహ్మద్ పాల్గొన్నారు.

వృద్ధుడు దారుణ హత్య

(మొదటి పేజీ తరువాయి)

ఎంతో కలివిడిగా ఉండే ఫిలిప్ మద్యానికి బానిస. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం అతని నివాసానికి సమీపంలోనే మృతి చెంది ఉండటం, ఒంటిపై గాయాలు ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. టూటౌన్ సిఐ ఎ.సుధాకర్ ఘటనా స్థలిని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సమీప బంధువైన యువకుడితో నెలకొన్న వివాదమే హత్యకు కారణంగా పోలీసులు భావిస్తున్నారు. పాతనేరస్తుడు, వరుసకు ఫిలిప్‌కు అల్లుడయ్యే యువకునితోనే వివాదం నెలకొందని, క్రిస్మస్ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టార్‌ను ఆ యువకుడు మృతుని ఇంట ఉంచాడని, దానిని తీసేయాల్సిందిగా పలుమార్లు ఆ యువకుడిని ఫిలిప్ వారించాడని సమాచారం. సోమవారం రాత్రి ఇద్దరికీ వాదోపవాదాలు జరిగాయని, ఆగ్రహించిన యువకుడు మంగళవారం తెల్లవారుజామున ఫిలిప్‌పై విచక్షణా రహితంగా దాడిచేసి, రోడ్డుకువేసి మోది, మెడకు తాడు తగిలించి పాశవికంగా ఈడ్చి హతమార్చినట్లు స్థానికులు చెబుతున్నారు. నిందితుడు ప్రస్తుతం పోలీసులు అదుపులో ఉన్నట్లు సమాచారం. దీనిపై సిఐ ఎ.సుధాకర్ వివరణ కోరగా స్వల్ప వివాదమే హత్యకు కారణంగా భావిస్తున్నామని, స్థానికంగా ఉన్న ఓ యువకుడిపై మృతుని బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారని, ఆదిశగా దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

జాతరపై సమీక్షకు పలు శాఖలు గైర్హాజరు

ప్రజాశక్తి -దుర్గి



మండలంలోని శ్రీ నిదానంపాటి అమ్మవారి జాతర ఈనెల 24న నిర్వహిస్తున్న సందర్భంగా జాతరకు వచ్చే లక్షలాది మంది సందర్శకులకు సౌకర్యాలు కల్పించేందుకు మంగళవారం అమ్మవారి దేవాలయం వద్ద ఆలయ సమావేశపు హాలులో పలు శాఖల అధికారులతో సమీక్ష ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటలకు నిర్వహించాల్సిన సమీక్ష సమావేశం గంటన్నర ఆలస్యంగా ప్రారంభమైంది. అయితే ప్రధాన శాఖలైన పంచాయతీ, పోలీసు, ఎక్సైజ్, విద్యుత్ అధికారులు ఆయా శాఖల సిబ్బంది సమావేశానికి గైర్హాజరవడంతో తూతూ మంత్రంగానే సమీక్ష సాగింది. డీటీ.. ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆలయ ఈవో పి.సైదమ్మబాయి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమిష్టి కృషితో సందర్శకులకు అసౌకర్యాలు కలగకుండా జాతరను విజయవంతం చేయాలని కోరారు. సమావేశానికి హాజరుకాని ప్రధాన శాఖల అధికారులు రెండో సమావేశానికి హాజరు కావాలని, లేకుంటే సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తామని చెప్పారు. వైద్యాధికారి పెద్ద సైదులు మాట్లాడుతూ ఆలయం సమీపంలో తమకు స్థలాన్ని కేటాయిస్తే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. కొన్ని మందులను సమకూర్చి అందించాలని కోరారు. అగ్నిమాపక సిబ్బంది సునీల్ కుమార్ మాట్లాడుతూ పొంగళ్ళు చేసే ప్రాంతంలో స్థలాన్ని కేటాయిస్తే పర్యవేక్షిస్తామన్నారు.

గన్నవరంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి - మాచర్ల



రైతులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కోట్లాది రూపాయలతో సబ్‌స్టేషన్స్ నిర్మాణాలు పూర్తి చేశామని ఎమ్మెల్యే పిన్నెల్లి రామక్రిష్ణారెడ్డి అన్నారు. మండలంలోని గన్నవరంలో రూ.4.5 కోట్లతో నిర్మించిన 33/11కెవి సబ్ స్టేషన్‌ను ఆయన మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. పల్నాడు ప్రాంతంలో ప్రధానంగా మాచర్ల నియోజకవర్గంలో బోర్లపై ఆధారపడి వ్యవసాయం చేసే రైతులు ఎక్కువన్నారు. వారికి నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయలు వ్యయం చేసినట్లు వివరించారు. రైతు సంక్షేమం కోసం జగనన్న ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టిందన్నారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి మల్లు స్వామి, ఎంపిపి బి.మంగమ్మ, నాయకులు బి.శ్రీనివాసరావు, కాంట్రాక్టర్ బాల, ఇఇ శ్రీనివాసరెడ్డి (కనస్ట్రక్షన్), ఇఇ హరిబాబు, డిఇ రామయ్య, ఎఇ రాంబాబు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-రొంపిచర్ల



అర్హులైన ప్రతి పేదవానికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే వైసిపి లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని రామిరెడ్డిపాలెంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే మంగళవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పంచాయతీ కార్యాలయం బి.సి కమ్యూనిటీ హాల్ ప్రహరీకి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అందించడంలో రాజకీయాలు, కులాలు, మతాలు, పార్టీలకతీతంగా అవినీతికి తావు లేకుండా అమలు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో వైయస్సార్ పెన్షన్ కానుక 224 మంది, జగనన్న అమ్మఒడి 150 మంది, వైయస్సార్ రైతు భరోసా 210 మంది, వైయస్సార్ ఈబిసి నేస్తం 310 మందికి, 42 మందికి ఇళ్ల పట్టాలు, రూ 21 లక్షలతో నాడుబినేడు ద్వారా పాఠశాల అభివద్ధి రూ 20 లక్షలు జల జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు పథకం ఏర్పాటు చేశామన్నారు. వైసిపి హయాంలో సంక్షేమం, అభివృద్ధి ద్వారా గ్రామంలో రూ 7.05 కోట్లతో చేసినట్లు చెప్పారు. వీటిని చూసి వచ్చే ఎన్నికల్లో ఓటేయాలని కోరారు.

ప్రత్తిపాడులో వరుస దొంగతనాలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నీయోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో వరుస దొంగతనాలతో ప్రజలను బయ బ్రాంతులకు గురి అవుతున్నారు. ఇవి అన్ని పోలిస్‌స్టేషన్ కూతవేటు దూరంలో జరిగిన వాటిపై కేసు నమోదు కాలేదు. మంగళవారం రాత్రి పరిది లోని దొంగలు అయ్యప స్వామి గుడిలో ఉన్న హుండీని పగలగొట్టే ప్రయత్నం చేశారు. హుండీ పగలక పోయేసరికి వదిలేసి వెళ్ళారు. తుమ్మలపాలెంలోని విష్ణు దేవలయంలోని హుండీలో ఉన్న సుమారు రూ.రెండు లక్షలను అపహరించారు. గనికపూడిలోని ఒక రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో సుమారు రూ.మూడు లక్షలవిలువ చేసేబంగారం వెండి దోచుకెళ్ళారు. అంతే కాకుండా పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోని కిరాణా దుకాణం, మెడికల్ షాపులు, బంగారం తయారీ చేసె షాపులో కూడా వరుస చోరీలు జరుగుతుండతంతో ప్రజలు బెంబెలెత్తుతున్నారు. సిసి కెమెరాలు పెట్టుకున్న ఉపయోగం లేకుండా పోతోందని వాపోతున్నారు. కనీసం బిట్ తిరిగే గస్తీ కూడ ఎక్కడ లేక పోవడంతో దొంగతనలు ఎక్కువ అయిపోయాయి అని ప్రజలుఆందోళనకు గురవుతున్నారు.

గ్రామీణాభివృద్ధి విభాగం ఆధ్వర్యంలో 13న వర్క్‌షాప్

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని గ్రామీణ అభివృద్ధి విభాగం ఈనెల 13న నిర్వహించనున్న స్వచ్ఛంద సంస్థలు, గ్రామీణ అభివృద్ధి అంశంపై వర్క్‌షాప్ బ్రోచర్‌ను వీసీ పి.రాజశేఖర్ మంగళవారం ఆవిష్కరించారు. విభాగాధిపతి డాక్టర్ దివ్య తేజోమూర్తి మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, వాటిని బలోపేతం చేయడానికి మరిన్ని చర్యలు తీసుకోవలసిన ఆవశ్యకత ఉందని అన్నారు. వీటిపై సుదీర్ఘంగా చర్చించేందుకు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామన్నారు. వీసీ మాట్లాడుతూ గ్రామీణ అభివద్ధి అనేది దేశానికి పట్టుకొమ్మలుగా ఉంటుందని అన్నారు. ఎంతో ప్రాధాన్యత ఉన్న ఈ అంశం నేటి తరానికి దిక్సూచిగా మారి వారిలో గ్రామీణాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు.

పరిహారం దక్కే వరకూ పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

వి.వెంకటరామయ్య మాట్లాడుతూ గతేడాది బస్తాకు రూపాయి చొప్పున బీమా వసూలు చేస్తే ఈ ఏడాది రూ.రెండు చొప్పున రూ.24 లక్షలు వసూలు చేశారని చెప్పారు. బీమా ప్రీమియం రూ.8 లక్షలు చెల్లించి ఉంటే రూ.150 కోట్ల పరిహారం వచ్చేదని, రూ.రెండు లక్షల ప్రీమీమియమే చెల్లించడం వల్ల రూ.40 కోట్లే వస్తుందని అన్నారు. మిగతా మొత్తాన్ని యజమాని నుండి ప్రభుత్వం వసూలు చేసి రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కో-కన్వీనర్ ఎం.శివసాంబిరెడ్డి మాట్లాడుతూ రూ.115 కోట్ల పసుపు పంట దగ్ధమైనా ప్రభుత్వం నుండి స్పందన లేకపోవడం దారుణమన్నారు. కోల్డ్ స్టోరేజీ యజమాని పటిష్ట చర్యలు తీసుకుని ఉంటే ఇంత ప్రమాదం జరిగేది కాదన్నారు. స్టోరేజీలోని సరుకు నిల్వలో 30 వేల బస్తాలు తేడా ఎలా వచ్చిందో ప్రభుత్వం తేల్చాలని డిమాండ్ చేశారు. దీక్షలకు ఆర్టీసీ యూనియన్ మాజీ నాయకులు గద్దె రవీంద్ర, విశ్రాంత రైల్వే ఉద్యోగి బుజ్జి సంఘీభావం తెలిపారు. పసుపు రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు జొన్న శివశంకర్, సిపిఎం మండల కార్యదర్శి జె.బాలరాజు, రైతు నాయకులు చంద్రశేఖర్, వై.బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన మల్లేశ్వరస్వామి ఆలయం

ప్రజాశక్తి-తెనాలి

మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే బ్రహోత్సవాలకు పెదకాకాని దుర్గామల్లేశ్వరస్వామి వారి ఆలయం ముస్తాబైంది. బుధవారం నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలు ఈనెల 12 వరకూ కొనసాగుతాయని ఆలయ ఉపకమిషనర్ దాసర శ్రీరామవరప్రసాద్ తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు నేతృత్వంలో ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉత్సవాల ప్రారంభం సందర్భంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వార్లు పెండ్లికుమారుడు, పెండ్లి కుమార్తెగా భక్తులకు దర్శనమిస్తారని, ఉదయం ఐదు గంటలకు సుప్రభాత సేవ, 8.30 గంటలకు పంచహారతులు, సాయంత్రం 4.30 గంటలకు యాగశాలలో విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనము, రాత్రి 10.30 ధ్వజారోహణ, అలాగే సాయంత్రం 5 గంటలకు ఎ.రామకృష్ణశాస్త్రిచే భక్తిరంజని, ఆరుగంటలకు విజయవాడకు చెందిన సుధాకర్‌చే హరికథ, రాత్రి ఏడుగంటలకు తెనాలికి చెందిన తేజశ్విప్రఖ్య కూచిపూడి నృత్యం వంటి సాస్కృతిక ప్రదర్శనలుంటాయని ఉపకమిషన్ తెలిపారు.

తెలంగాణా మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-తెనాలి

పట్టణ ఒన్‌టౌన్ పోలీసులు తెలంగాణా మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అరెస్ట్ చేసి, అతని నుంచి 46 బాటిల్స్ మద్యం స్వాదీనం చేసుకున్నారు. సిఐ దశరథరామారావు వెల్లడించిన వివరాల ప్రకారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తెలంగాణా మద్యం నిల్వలు కలిగిఉన్నాడన్న విశ్వసనీయ సమాచారంతో ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మునగాల తారక కృష్ణను అరెస్ట్ చేశారు. అతని నుంచి 51 మద్యం సీసాలు స్వాదీనం చేసుకున్నారు. క్వార్టర్ బాటిల్స్ ఐదు, 44 ఫుల్ బాటిల్స్. లీటరు బాటిల్ ఒకటి, టూలీటర్స్ బాటిల్ ఒకటి స్వాదీనం చేసుకున్నారు.



నలుగురు గంజాయి విక్రేతలు అరెస్ట్

రెండు కిలో సరుకు, నాలుగు బైక్‌లు స్వాధీనం

ఎన్నికలు సమీపిస్తున్న వేళ పోలీసుల తనిఖీలు ముమ్మరం



వెల్లడిస్తున్న డిఎస్పీ రమేష్



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసులు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఎన్నికల సమీ పిస్తున్న వేళ ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు పోలీసులు దాడులు ముమ్మరం చేశారు. అనధికార మద్యం విక్రయాలు, గంజాయి వంటి వాటిపై నిఘా పెంచారు. దీనిలో భాగంగా సోమవారం రాత్రి పట్టణ త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదుగురిలో ఒకరు పారిపోగా, నలుగురు గంజాయి విక్రేతలను పట్టుకుని వారి నుంచి 1.2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. మంగళవారం కూడా పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పట్టణ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో నలుగురు గంజాయి విక్రేతలు పట్టుబడ్డారు. స్థానిక ఆర్టీసి బస్టాండ్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డిఎస్పీ ఎం.రమేష్ వివరాలను వెల్లడించారు. కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన పాముల రుషిబాబు అలియాస్ పెద్దచోటు, కొల్లిపర మండల కేంద్రం అంబేద్కర్ నగర్‌కు చెందిన తూమాటి శ్యామ్‌కుమార్ అలియాస్ చిన్నసన్ని, మంద్రు రాజ్‌కుమార్ అలియాస్ పెద్దసన్ని, మల్లోల శోభన్‌బాబును పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో పాముల రుషిబాబు బిటెక్ ఫెయిలై గంజాయికి బానిసయ్యాడు. గంజాయి విక్రయాన్ని ఆదాయ వనరుగా భావించిన రుషిబాబు తనకు తోడుగా తూమాటి శ్యామ్‌కుమార్, మంద్రురాజ్‌కుమార్, మల్లోల శోభన్‌బాబుతో కలిసి తునిలో కేజి గంజాయిని రూ.5వేలకు కొనుగోలు చేసి దానిని 20 గ్రాముల ప్యాకెట్లుగా చేసి రూ.200చొప్పున తెనాలి రైల్వే స్టేషన్, బస్టాండ్, పరిసర ప్రాంతాల్లో విక్రయించి, వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విశ్వసనీయ సమాచారంతో వలపన్ని నలుగురినీ అదుపులోకి తీసుకుని, తహశీల్దార్, మధ్యవర్తుల సమక్షంలో అరెస్ట్ చేసి, వారి నుంచి 2కేజీల గంజాయి, వారు దొంగిలించిన నాలుగు బైక్‌లను స్వాదీనం చేసుకున్నట్లు డిఎస్పీ వెల్లడించారు. నిందితులపై పిడి యాక్ట్ కూడా ఉపయోగిస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై పూర్తి నిఘా ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో సిఐ ఎ.సుధాకర్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్

ఆల్ రౌండర్‌గా ఉంటేనే సక్సెస్

విద్యార్థులతో డాక్టర్ పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విద్యార్థులు ఆల్ రౌండర్‌గా, టీమ్‌గా పనిచేసినప్పుడే సక్సెస్ వస్తుందని గుంటూరు లోక్‌సభ టిడిపి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. పుల్లడిగుంట వద్ద ఉన్న ప్రియదర్శిని ఇన్స్ టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్ మెంట్ గ్రౌండ్స్ లో ఫ్రెషర్స్ డే కార్యక్రమం మంగళవారం జరిగింది. ఆ కార్యక్రమానికి డాక్టర్ పెమ్మసానితో పాటు ప్రత్తిపాడు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి బూర్ల రామాంజనేయులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ విద్యార్థులు తలుచుకుంటే సాధించలేనిది అంటూ ఏదీ లేదని, వ్యక్తిగత ప్రేరణ, క్రమశిక్షణ ఉన్న ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని చేరుకోగలరని చెప్పారు. ప్రతి వ్యక్తి తన చివరి నిమిషంలో ఫలానా పని చేయలేకపోయామని బాధపడకూడదని సూచించారు. ఓటేసే ముందు ప్రతీ ఒక్కరు వ్యక్తిగతంగా ప్రశ్నించుకొని, ఎవరైతే సమాజానికి ఉపయోగపడతారో ఆలోచించి మరీ ఓటేయాలని డా. పెమ్మసాని కోరారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ చైర్మన్ చందు రామారావు, ప్రిన్సిపల్ చందు బాబు తదితరులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	:	1,28,440
మిర్చి ఎగుమతి	:	1,20,429
మిర్చి నిల్వ	:	1,03,461

మిర్చి ధరలు

రూపాయలలో

334	9,000 - 19,800
నెం.5	11,000 - 18,000
273	12,500 - 18,000
341	10,000 - 20,000
4884	13,000 - 18,000
సూపర్ 10	12,000 - 15,500
నాన్ ఎసి	
తేజ	8,500 - 20,700
బడిగి	9,500 - 21,500
దేవనూరు డీలక్స్	9,000 - 20,000
తాలుకాయలు	5,000 - 12,000

సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర బలగాలు కవాతు





ప్రజాశక్తి - దుగ్గిరాల

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వానికి చెందిన సెంట్రల్ ఇండస్ట్రీస్ సెక్యూరిటీ ఫోర్స్ కవాతు నిర్వహించింది. దుగ్గిరాల మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన తుమ్మపూడి, చిలువూరు, కంఠం రాజు కొండూరు గ్రామాలలో మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి చెందిన సెక్యూరిటీ ఫోర్స్ స్థానిక పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. గురువారం ఈమని, పేరుకలపూడి గ్రామాలలో కవాతు నిర్వహించనున్నట్లు స్థానిక ఎస్సై బి మహేంద్ర తెలిపారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చిన కేంద్ర ప్రభుత్వ దళాలు కచ్చితంగా తమకు కేటాయించిన కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి భద్రత చర్యలు తీసుకుంటారని, దీనివలన ఎన్నికలు సక్రమంగా నిర్వహించే అవకాశం కలుగుతుందని ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి - మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల డోకిపర్రు , మేడికొండూరు పలు గ్రామాలలో రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేడికొండూరు సిఐ డి. జయ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల వేళలో శాంతి భద్రతలు పరిరక్షణలో భాగంగా ఈ ప్రత్యేకమైన రూటు కవాతు నిర్వహించి నట్లు తెలిపారు. శాంతిభద్రతలకు విఘా తం కలిగించే ఏ ఒక్కరిని వదిలి పెట్టేది లేదని చట్టపరంగా చర్యలు తీసుకుంటా మని తెలిపారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ స్టేషన్ సిబ్బంది, సిఏపిఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడు మృతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

రైలు కింద పడి యువకుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని శ్రీనివాస్ కాలనీ సమీపంలో మంగళవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ప్రజాశక్తి నగర్‌కు చెందిన కరిముల్లా (25)ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో మంగళవారం తెల్లవారు జామున రెండు గంటల సమయంలో ఇంటి నుండి వచ్చి రైల్వే ట్రాక్ పై కాళ్లు పెట్టడంతో రెండు కాళ్లు తెగిపడిపోయాయని గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు తెలియజేయగా కరిముల్లాను వైద్యశాలకు తరలించే ప్రయత్నంలో కరిముల్లా మృతి చెందినట్లు తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటమొద్దు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న చదువులతో ప్రభుత్వం చెలగాటమాడితే సహించేది లేదని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పల్నాడు జిల్లా కార్యదర్శి కె.సాయికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉన్నత విద్య, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ విద్యార్థులకు వసతి, విద్యాదీవెన విడుదల చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. జిల్లాకు సంబంధించి బీసీ, ఎస్టీ, ఎస్సీ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు 4 నెలలు మెస్, కాస్మోటిక్ బకాయిలు పెండింగ్లో ఉన్నాయని తెలిపారు. సంక్షేమ హాస్టళ్లలో నాడు-నేడును అమలు చేయాలని, శిథిలావస్థకు చేరిన హాస్టళ్ల స్థానే నూతన భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, విద్య పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ అంశాలను పరిష్కరించాలని, లేకుంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.



చిత్రకారుడు జెస్టిస్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - వినుకొండ

రాజమండ్రి ఆదిత్య డిగ్రీ కళాశాల ఆవరణలో రాజమండ్రి సీనియర్ పాత్రికేయులు, తెలుగు మాస్టారు సుదర్శన్ నిర్వహిస్తున్న ప్రజాపత్రిక 97వ వార్షికోత్సవం సందర్భంగా వినుకొండకు చెందిన ప్రముఖ చిత్రకారులు వజ్రగిరి జెస్టిస్ గీసిన 20 చిత్రాలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను ఒంగోలు బ్యూలాటీచర్, వజ్రగిరి విజయ వర్ధన్, చిత్రకారులు వెంకటరమణ సమీక్షించారు. ప్రముఖులు, కళాకారులు, డాక్టర్లు, రిటైర్డ్ ప్రొఫెసర్స్, ప్రిన్సిపాల్స్, వివిధ రంగాల ప్రముఖులు, కళాభిమానులు చిత్రాలను వీక్షించి ప్రశంసించారు, వినుకొండ విశ్వ వ్యాప్తంగా గొప్ప పేరు ప్రఖ్యాతులు సంపాదించిన గుర్రం జాషువాను గుర్తు చేస్తూ అదే గడ్డపై నివసిస్తున్న జస్టిస్ సామాజిక స్పృహ ఉన్న ఎంతో గొప్ప చిత్రకారుడిగా రాణిస్తున్నారని అభినందనలు తెలిపారు. జెస్టిస్ గీసిన చిత్రాలపై క్విజ్ నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జెస్టిస్‌ను సత్కరించారు.



మున్సిపాల్టీ ప్రభ సిద్ధం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మహాశివరాత్రి సందర్భంగా నర్సరావుపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభ ముందుగా పట్టణం నుండి బయలుదేరడం ప్రతి సంవత్సరం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది కూడా పురపాలక సంఘం కార్యాలయం నుండి కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రభను మంగళవారం విద్యుత్ కాంతులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రరెడ్డి, డిప్యూటీ ఇంజినీర్ ఓలేటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రభను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహారావు, మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి, పురపాలక సంఘం అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోటప్పకొండ తిరునాళ్లకు గతంకంటే మెరుగ్గా ఏర్పాట్లు

- రాజకీయంగా రెచ్చగొట్టేలా పాటలు పెట్టొద్దు
- సాయంత్రం 4 గంటలకే ప్రభలు చేసుకోవాలి
- కొండ వద్ద సమీక్షలో కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండలో 8న నిర్వహించే ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ చెప్పారు. ఉత్సవాల నిర్వహణపై కోటప్పకొండ వద్ద జిల్లా అధికారులతో మంగళవారం సమీక్షించారు. అప్రోచ్ రోడ్లు ఏర్పాటు చేశామని, గతం కంటే మెరుగ్గా సేవలు అందించే విధంగా చర్యలు తీసుకున్నామని చెప్పారు. తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించామన్నారు. ప్రతిఒక్కరూ ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసు, రెవెన్యూ సిబ్బంది మొత్తం కలిపి సుమారు 5000 మంది వరకు విధులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది 3 వేల



మంది బందోబస్తు విధుల్లో ఉంటారన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూస్తామన్నారు. ప్రత్యామ్నాయ మార్గాలనూ ఏర్పాటు చేశామన్నారు. ప్రభలు ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటలకే వాటి స్థానాల్లో చేరుకునేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉత్సవాల సమయంలో ప్రజలను రెచ్చగొట్టే పాటలు, రాజకీయ సమస్యలు సృష్టించే పాటలను పెట్టవద్దని కోరారు. కాలి నడకన వెళ్లే సందర్శకులు మెట్ల మార్గం సులువైందని ఘాట్‌రోడ్లో అనుమతి లేదని తెలిపారు. అందరికీ దర్శన సౌలభ్యం కోసం క్యూ లైన్లలో మార్పులు చేశామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గతంలో కంటే మెరుగ్గా ఉత్సవాల ఏర్పాట్లు చేశామన్నారు. ప్రధానంగా ఘాట్‌రోడ్‌లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. సాయంత్రం ఐదు గంటల నుండి తెల్లవారుజామున అయిదు గంటల వరకు ఉత్సవాలు జరిగే నేపథ్యంలో సందర్శకులు సహనంగా వ్యవహరించాలని, ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరిగేటట్లు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎలమంద, పెట్లూరివారిపాలెం రోడ్లను ప్రభల రాకకు, జెఎన్‌టియు రోడ్లను తిరుగు ప్రయాణానికి ఉపయోగించుకోవాలని సూచించారు. ఉత్సవాలకు ఎక్కువ సంఖ్యలో సందర్శకులు రానున్న నేపథ్యంలో ఐదు లక్షల వాటర్ ప్యాకెట్లు, రెండు లక్షల మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేశామన్నారు. నాలుగు చక్రాల వాహనాలను కిందనే పార్కు చేసుకొని పైకి వచ్చే విధంగా బస్సులను ఉపయోగించుకోవాలని సూచించారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, డిఆర్ఒ వినాయకం, ఆర్‌డిఒ సరోజ, ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి పిల్లల వార్డులో టీవీ



ప్రజాశక్తి-సత్తెనపల్లి

పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులో టీవీని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మంగవారం ప్రారంభించారు. చిన్నపిల్లలు వీడియోలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ చిన్నారులకు ఇష్టమైన వీడియోలను ప్రదర్శించటం వల్ల సగం జబ్బు నయమవుతుందని, అంతేగాక పిల్లలు ఎలా ఉండాలి అనే అంశాలతో పొందుపర్చిన విడియోలను ప్రదర్శిస్తామని చెప్పారు. కార్పొరేట్ హాస్పిటల్లో కూడా టీవీలు ఉండవని, వీటిని సమకూర్చిన రామకృష్ణకు ప్రత్యేక ధన్యవాదాలని చెప్పారు. రామకృష్ణ మాట్లాడుతూ చిన్న పిల్లల, ప్రసూతి వార్డులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలని తమ ఆశయమని అన్నారు. ఆస్పత్రికి వచ్చినవారు సంపూర్ణ ఆరోగ్యం, సంతోషంతో వెళ్లాలనేది తమ అభిమతమని చెప్పారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, హెడ్ సిస్టర్ వెంకటేశ్వరమ్మ, జిడిఎ గోపి, పెట్స్ కంట్రోల్ సుధీరు, శ్రీనివాస్, నర్సులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కమీషన్ల కక్కుర్తితో నిలిచిన తాగునీటి పథకం

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలో శాశ్వత తాగునీటి పథకం పూర్తి చేయలేని అసమర్థ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు విమర్శించారు. పట్టణంలోని ఎన్ఎస్పి కాలనీ, గాయత్రి నగర్లో నిలిచిపోయిన శాశ్వత తాగునీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంకులు, నిరుపయోగంగా ఉన్న పైపులు, ఇతర సామగ్రిని జీవి ఆంజనేయులు, టిడిపి నాయకులు మంగళవారం సందర్శించారు. ఆంజనేయులు మాట్లాడుతూ టిడిపి పాలనలో వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్ల మున్సిపాలిటీలకు రూ.381 కోట్లు మంజూరు చేయించి పనులు ప్రారంభించగా ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం రివర్స్ టెంటరింగ్ పేర్లతో పనులు నిలిపేసిందన్నారు. వినుకొండ పట్టణానికి రూ.161 కోట్లతో శాశ్వత తాగునీటి పథకానికి పనులు చేయాల్సి ఉండగా పైప్ లైన్, ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మాణానికి పనులు జరుగుతుండగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కమీషన్లకు కక్కుర్తి పడి కాంట్రాక్టర్లను ఇబ్బంది పెట్టడంతో పనులను కాంట్రాక్టర్లు నిలిపేసి వెళ్లిపోయారని చెప్పారు. ఏడాదిలో పూర్తి చేయాల్సిన శాశ్వత తాగునీటి పథకానికి తూట్లు పొడిచారని మండిపడ్డారు. ఎమ్మెల్యే స్వార్థానికి త్రాగునీటి పథకం పనులు నిలిచిపోయి దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ప్రజల కలగా మిగిలిపోయింది అన్నారు. చెరువు కూడికలు పేరుతో రూ.20 లక్షల ఖర్చు చేసి నలభై లక్షలు కాజేసి మురికి నీరు ఇస్తున్నారని దుయ్యబట్టారు. రానున్న టిడిపి-జనసేన ప్రభుత్వంలో రెండేళ్లలో తాగునీటి పథకాన్ని పూర్తి చేసి స్వచ్ఛమైన నీరు ప్రజలకు సరఫరా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు పటాన్ అయుబ్ ఖాన్, నాయకులు పీవీ సురేష్‌బాబు, పి.దాసయ్య, వి.పేరయ్య, దస్తగిరి, కౌన్సిలర్లు వి.లింగమూర్తి, పి.నాగరాజు, జి.సుబ్బారావు, ఎస్.శ్రీనివాసరావు, టి.కాశి, జిమ్ జాని పాల్గొన్నారు. ఇదిలా ఉండగా టిడిపి పట్టణ సాంస్కృ విభాగం అధ్యక్షులుగా చెందిన పారెళ్ల సుబ్రమణ్యంను నియమిస్తూ ధ్రువపత్రాన్ని జీవీ ఆంజనేయులు అందచేశారు. ఆయనకు సుబ్రమణ్యం కృతజ్ఞతలు తెలిపారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - వినుకొండ

మహాశివరాత్రి సందర్భంగా పట్టణ, పరిసర ప్రాంత ప్రజల సౌకర్యార్థం వినుకొండ డిపో నుండి కోటప్పకొండ, ఇతర శైవక్షేత్రాలకు 43 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ బి.కోటేశ్వరనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినుకొండ - శ్రీశైలం : 13 బస్సులు, వినుకొండ - త్రిపురాంతకం :7 బస్సులు, వినుకొండ - మన్నేపల్లి : 4 ప్రత్యేక బస్సులు వినుకొండ డిపో నుండి నడుపుతామని, వీటిల్లో సాధారణ చార్జీలు మాత్రమే వసూలు చేస్తామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.



వాల్స్‌కి, మోటార్లకు తేడా తెలీదా? : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వినుకొండ

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వైసిపి నుండి వెళ్లినప్పుడే ప్రజలు అతన్ని వదిలేశారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మంగళవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. వరికపూడిశెలకు అనుమతులు ఎంపీ తాను తెచ్చానని చెప్పుకోవడం అవివేకమని, వైసిపి ప్రభుత్వం ద్వారా అనుమతులు వచ్చాయని అన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య ఏ గడపకు లేకుండా తాను చేస్తుంటే రూ.161 కోట్లు శాశ్వత తాగునీటికి తెచ్చానని జీవీ ఆంజనేయులు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. శాశ్వత తాగునీటి పథకం పనులు 2022లో ప్రారంభమయ్యాయని, వాల్స్‌కి మోటార్స్‌కి తేడా తెలియదా? అని ప్రశ్నించారు. 175 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణంటూ నిరాధారణమైన ఆరోపణలు చేయడం సరికాదని, సెంటు భూమి ఉన్నట్టు నిరూపిస్తే పేదలకు ఇస్తానని నాడే తాను చెప్పానని అన్నారు. బ్రహ్మనాయుడుని జైలుకు పంపడం ఎవరి తరం కాదన్నారు. కోడెల కుటుంబానికి అన్యాయం చేసింది మీరు కాదా? అని ప్రశ్నించారు. మజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయన్నారు. నాడు దయ్యమైన చంద్రబాబు ఈరోజు దేవుడు ఎలా అయ్యాడో చెప్పాలన్నారు. సొసైటీల పేరుతో చేపల చెరువులను దోచుకుంది ఎవరో అందరికి తెలుసన్నారు. వినుకొండలో అభివృద్ధిని అడ్డుకునేందుకు కోర్టులో కేసులు వేయిస్తున్నది ఎవరో ప్రజలకు తెలుసన్నారు.

సత్య ఇంపెక్స్ లిమిటెడ్‌తో వర్సిటీ ఎంఒయు

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్ విభాగం గుంటూరులోని ప్రముఖ చిల్లీస్, సుగంధ ద్రవ్యాల ఎగుమతుల సంస్థ అయిన సత్య ఇంపెక్స్ లిమిటెడ్‌తో మంగళవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పి. రాజశేఖర్ సమక్షంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బీ. కరుణ, సత్య ఇంపెక్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ టి. రామకష్ణులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి, ఆ పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. సత్య ఇంపెక్స్ కంపెనీ గుంటూరు నుంచి మిర్చి, సుగంధ ద్రవ్యాలు తో పాటు ఆక్వాఫుడ్స్‌ను చైనా, మలేషియా, వియత్నాం, అమెరికా వంటి దేశాలకు ఎగుమతులు చేస్తుంది. ఈ సంస్థ ఎంబీఏ విద్యార్థులకు కోర్సు రూపకల్పన, సిలబస్ ఎంపిక చేయటం, ప్రాజెక్టు వర్క్ కేటాయించడం, ఉపన్యాస కార్యక్రమాలు, ఎగుమతులపై శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించే విషయాలపై ఈ అవగాహన ఒప్పందంలో పరస్పర సహకారం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు తరగతిగది బోధనతోపాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ కూడా చాలా అవసరం అన్నారు. నిరంతరం ఎగుమతులు చేస్తున్న సంస్థలతో ఎం ఓ యూ కుదుర్చుకోవడం ద్వారా విద్యార్థులకు ఆయా అంశాల్లో పట్టు సాధించే అవకాశాలు పుష్కలంగా ఉంటాయని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో తులసి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ యోగేష్ చంద్ర , ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్ విభాగాధిపతి ఆచార్య వి. చంద్రశేఖర రావు, సహాయ ఆచార్యులు డాక్టర్ ఎన్ ప్రసన్న కుమార్, అధ్యాపకులు డాక్టర్ పి. విజయ వాణి, డాక్టర్ జాకీర్ హుస్సేన్, డాక్టర్ వి. చక్రవర్తి, డాక్టర్ జి . ఉమ తదితరులు పాల్గొన్నారు.

సబ్జెక్టుపై పట్టు సాధిస్తే విజయం తధ్యం : జెసి

ప్రజాశక్తి-గుంటూరు

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు పరీక్షల్లో విజయం సాధించాలంటే సబ్జెక్టుపై పూర్తి అవగాహన ఏర్పరుచుకొని చదివితే విజయం సాధ్యమని జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. స్థానిక రాజాగారితోటలోని ఎపి బిసి స్టడీ సర్కిల్లో గ్రూప్-1, గ్రూప్-2 పోటీ పరీక్షల ఉచిత శిక్షణకు హాజరవుతున్న అభ్యర్థులను ఉద్దేశించి ప్రసంగించారు. స్టడీ సర్కిల్ డైరెక్టర్ డి.మధుసూదనరావు అధ్యక్షతన జరిగిన సభలో రాజకుమారి మాట్లాడుతూ 5 నుండి 10వ తరగతి వరకూ ఉన్న పాఠ్యాంశాలతోపాటు, ఆయా సిలబస్‌కు సంబంధి ంచిన టెక్స్టుబుక్స్‌నే కాకుండా ప్రస్తుతం జరుగుతున్న అన్ని అంశాలకు సంబంధించిన విషయాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, సంఘంలో హోదా, కుటుంబానికి ఆర్థిక పరిపుష్టి ఏర్పడుతుందన్నారు.బయట కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకోలేని ఎంతోమంది నిరుపేద అభ్యర్థులకు గుంటూరు బిసి స్టడీ సర్కిల్ కేంద్రం ఒక వరమని పేర్కొన్నారు. ఈ శిక్షణతోపాటు రూ.2500లు విలువ చేసే స్టడీ మెటీరియల్ కూడా అభ్యర్థులకు ఇస్తున్నట్లు చెప్పారు. బిసి, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులతోపాటు, 50 మంది ఓసి అభ్యర్థులకు కలెక్టర్ ఆదేశాలతో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థులు ఈ పరీక్షల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. యం.వి. నాయుడు, పవన్‌కుమార్, శేషయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి రాజకుమారి



పతకాలు సాధించిన వారితో కోచ్ సాయిరేవతి

పవర్ లిఫ్టింగ్‌లో సత్తాచాటిన క్రీడాకారులు

ప్రజాశక్తి-తెనాలి

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో, మంగళగిరిలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన క్విక్ ఫిట్‌నెస్ ఎరేనాలో శిక్షణ పొందుతున్న యువతీ, యువకులు పతకాలు సాధించారు. శిక్షకులు జి.సాయిరేవతి మంగళవారం వెల్లడించిన వివరాల ప్రకారం ఈనెల 2న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన పవల్‌లిఫ్టింగ్ మెన్ అండ్ ఉమెన్ పోటీల్లో పడాల దేవేంద్రరెడ్డి 120 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ కైవశం చేసుకున్నారు. అలాగే మంగళగిరిలో ఈనెల 3న జరిగిన జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 47 కేజీల విభాగంలో మధిర షానూన్, 84 కేజీల విభాగంలో ఈటూరి లక్ష్మి వినయశ్రీ, మెన్ 105 కేజీల విభాగంలో సంకా కౌశిక్, పడాల దేవేంద్రరెడ్డి ప్లస్ 120 కేజీల విభాగంలో సత్తాచాటి, ఈనెల 10 విశాఖపట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి పవల్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఇదే సంస్థలో శిక్షణ పొందిన కొనకి శ్రీకాంత్ 84 కేజీల విభాగంలో నాల్గవ స్థానం దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా క్రీడాకారులను క్విక్ ఫిట్‌నెస్ ఎరేనా నిర్వాహకులు కొమ్మినేని భార్గవ్‌కుమార్, కోచ్ ఘట్టనమేని సాయిరేవతి, పూసపాటి శివరామకిరణ్‌రాజు అభినందించారు.

ఎఎన్‌యు డిగ్రీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో డిగ్రీ కోర్సులకు సంబంధించి గత ఏడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు నిర్వహించిన ఐదవ సెమిస్టర్ బీఎస్సీ, బిబిఏ కోర్సు పరీక్షల ఫలితాలను మంగళవారం ఉపకులపతి ఆచార్య పి. రాజశేఖర్ విడుదల చేశారు. ఈ పరీక్షలకు మొత్తం 12906 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో 7505 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఈ ఫలితాలను విశ్వవిద్యాలయ వెబ్ సైట్ నుంచి పొందవచ్చునని అదనపు పరీక్షల నిర్వహణ అధికారి రెడ్డి ప్రకాష్ రావు తెలిపారు. ఫలితాలకు సంబంధించి రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునేవారు ఈనెల 19వ తేదీలోగా ఒక్కో పేపర్‌కు రూ.1240 చెల్లించి కోఆర్డినేటర్‌కు దరఖాస్తులు అందేలా పంపాలని తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి. వరప్రసాద మూర్తి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిద్దయ్య, సి టి ఏ లు ఆచార్య సత్యనారాయణ, డాక్టర్ సుధాకర్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ బట్టు నాగరాజు , మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ శాంతి శ్రీ, డాక్టర్ భబిత తదితరులు పాల్గొన్నారు.





పతకాలు సాధించిన విద్యార్థులు

అమరావతి హైస్కూల్ విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి-తాడేపల్లి :పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఈ నెల 2వ తేదీన జరిగిన జవహర్‌లాల్ నెహ్రు మెమోరియల్ నేషనల్ ఓపెన్ కరాటే డో ఛాంపియన్ షిప్ పోటీల్లో తాడేపల్లికి చెందిన అమరావతి హైస్కూల్ విద్యార్థులు రెండు సిల్వర్, మూడు వెండి పతకాలు సాధించారు. పది సంవత్సరాల్లోపు విద్యార్థులకు జరిగిన ఈ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన అభినవ్‌సత్య, మోహిత్‌రెడ్డి, సన్విత, శాన్వి, విన్యగ్రేస్ వరుసగా సిల్వర్, వెండి పతకాలు సాధించడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ హెూరాహెూరీగా జరిగిన పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించడం గొప్ప విషయమని కొనియాడారు. ఆటలకు మరింత ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.


నర్సింగ్ వృత్తికి మరింత గౌరవం పెంచండి

జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైందని ఆ వృత్తికి మరింతగా గౌరవం పొందేలా కృషి చేయాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం నర్సింగ్ ఫ్రెషర్స్ డే సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సింగ్ వృత్తిని ప్రతి ఒక్కరు బాధ్యత గా తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. రోగులను ప్రేమగా పలకరించినప్పుడు వారిలో నూతన ఉత్తేజం కలుగుతుందని ఆయన గుర్తు చేసారు. ఈ వృత్తి ని ఎంపిక చేసుకోవడం అభినందనీయమని అయన కొనియాడారు. నర్సింగ్ విద్యార్థిని విద్యార్థులు విద్యతో పాటు సంస్కారం కూడా నేర్చుకోవాలని సూచించారు. తల్లి తండ్రులు బాధ్యతగా పంపించినప్పుడు వారి ఆశలను కూడా కాపాడాలన్నారు. జీవితంలో ప్రతి ఒక్కరు ఉన్నత శిఖరాలను చేరాలంటే రోగులకు మంచిగా వైద్య సేవలు అందించాలని కోరారు. ముందుగా నర్సింగ్ విద్యార్థులతో కళాశాల ట్యూటర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమం లో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రాధికా , నర్సింగ్ సూపెరింటెండెంట్లు ఆషా సజని, గంగమ్మ, సమీనా, కిరణ్మయి , ఎం జ్యోతి బాబు పాల్గొన్నారు.





అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలి

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

మహిళలు అన్ని రంగాల్లో ముందుండి ఆర్థిక పరిపుష్టిని సాధించి తమకంటూ ఓ గుర్తింపు తెచ్చుకోవాలని పొన్నూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అసిస్టెంట్ సిడిపిఓ గీతాంజలి అన్నారు. మంగళవారం పొన్నూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళ స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా ప్రధానంగా మహిళల ఆరోగ్య పరిరక్షణకు కోట్ల రూపాయలు నిధులు ఖర్చు చేస్తుందని, ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలలో మహిళల ప్రాధాన్యతలో రాష్ట్రంలో ముందంజలో ఉందన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టడం హర్షనీయమని ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో సిడిపిఓ ఎస్ వెంకట రమణ, ఎంపీపీ భవనం పద్మలీల పలువురు అధికారులు అంగన్వాడీలు గీతాంజలిని సన్మానించారు.

ఫైన్ ఆర్ట్స్ విద్యార్థికి జాతీయ స్థాయిలో ఎక్సలెంట్ అవార్డు

పలువురుకి నగదుపురస్కారం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డిపార్ట్మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ మూడో సంవత్సరం విద్యార్థి ఎస్. నాగలక్ష్మి కి ఉత్తర ప్రదేశ్ లోని రాయబరేలి కి చెందిన ప్రముఖ అంతర్జాతీయ చిత్రకళా సంస్థ కళా రత్నం ఫౌండేషన్ ఆఫ్ ఆర్ట్ సొసైటీ సంస్థ ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన జాతీయస్థాయి పోర్ట్ ట్రైట్ విభాగంలో ఎక్సలెంట్ అవార్డు లభించింది. అలాగే ఒంగోలు లోని క్విస్ కళాశాల నిర్వహించిన ఆంధ్ర ప్రదేశ్ ఇంటర్ స్టేట్ లెవెల్ స్టూడెంట్ ఫెస్ట్ లో ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు సోను దాస్, సంజయ్, ఎలిజబెత్, కృప నరేష్, చిరంజీవి లకు పెయింటింగ్ పోటీలలో ద్వితీయ బహుమతి తో పాటు నగదు పురస్కారం లభించింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉప కులపతి ఆచార్య పి. రాజశేఖర్ అభినందించారు. విద్యార్థుల్లో ఉన్న సజనాత్మక ఆలోచనలను ప్రశంసించారు. భవిష్యత్ లో విశ్వవిద్యాలయానికి ఇంకా ఉన్నత గుర్తింపు తీసుకు రావాలని సూచించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్. స్వరూప రాణి విద్యార్థుల ప్రతిభను అభినందించారు .ఈ సందర్భంగా విద్యార్థిని హర్షం వ్యక్తం చేస్తూ తమ అధ్యాపకులు జాన్ రత్న బాబు ఇచ్చిన ప్రోత్సాహం , శిక్షణ తో తాము ఈ గుర్తింపు పొందామని చెప్పారు. అంతర్జాతీయంగా పేరొందిన ఆండ్రూ లూమిస్ మెథడ్, జాన్ రైలీ మెథడ్, అసార మెథడ్ ని ఉపయోగించి చిత్రీకరించడంతో తనకు ఈ అవార్డు వచ్చిందన్నారు. టోనల్ స్కేల్ ఉపయోగించినట్లు పేర్కొన్నారు. విభాగం అధ్యాపకులు జాన్ రత్న బాబు, ఫైన్ ఆర్ట్స్ స్టూడియో అసిస్టెంట్ వెంకటరమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి

శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం దాతల సహకారంతో ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో జరిగిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ప్రారంభించారు. చింతామణి రాయితో ఫ్లోరింగ్, గర్భగుడిలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. దాతలను ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ నేరెళ్ల లక్ష్మీ రాధిక, ఆలయ ఈవో జేవి నారాయణ, వైసిపి నాయకులు మునగాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.



కమ్యూనిస్టు యోధుడు స్టాలిన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - ఫిరంగిపురం రూరల్ :ప్రపంచ దేశాల్లో రష్యాను అగ్రరాజ్యంగా తీర్చిదిద్దిన స్టాలిన్ 71 వ వర్ధంతి సందర్భంగా పొనుగుపాడులో స్టాలిన్‌కు ఘననివాళులర్పించారు. ఆయన చిత్ర పటానికి సిపిఎం సీనియర్ న ఆయకులు కె రాఘవయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ వీరుడు స్టాలిన్ అని, ప్రపంచానికే అజాత శత్రువుగా ఉన్నటువంటి హిట్లర్ను మట్టికరి పించిన గొప్ప యోధుడు స్టాలిన్ అని అన్నారు. ప్రతి కార్యక్రమం లో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, జి వెంకటేశ్వరరావు, హరిబాబు, రాజకుమారి, కే కోటేశ్వరరావు పాల్గొన్నారు.




విలేకర్లతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

మాటలు కాదు.. నీటి సమస్యపై దృష్టి పెట్టండి..

మంత్రి రాంబాబుపై టిడిపి నాయకుల విమర్శలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మంత్రి అంబటి రాంబాబు ఊకదంపుడు ఉపన్యాసాలు మాని తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలని టిడిపి నాయకులు అన్నారు. సత్తెనపల్లిలోని ఎన్టీఆర్ భవన్‌లో టిడిపి పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి డి.శ్రీనివాసరావు మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సత్తెనపల్లి పట్టణంలో రెండ్రోజులకోసారి తాగునీటిని సరఫరా చేస్తున్నారని, దీనివల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సత్తెనపల్లి శివారు కాలనీల్లో తాగునీరు అందే అవకాశాల్లేవని, వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి ప్రజలు అవస్థలు పడుతున్నారని చెప్పారు. అంబటి రాంబాబు మాత్రం మున్సిపల్ సమావేశాల్లో ఊక దంపుడు ఉపన్యాసాలు తప్పితే జలవనరుల శాఖ మంత్రిగా ఉండి తన సొంత నియోజకవర్గంలోనే నీటి సమస్యను పరిష్కరించలేదని విమర్శించారు. అంబటి రాంబాబు ప్రతిపక్ష నాయకులను తిట్టే దానిలో 10 శాతం నీటి అవసరాలను తీర్చడానికి శ్రద్ధ పెడితే బాగుంటుందన్నారు. సమావేశంలో షేక్ జానీ, ఖాజావలి, టి.హరనాథ్, జి.సురేష్, ఎస్.వెంకట్రావు, షేక్ బాబు, మౌలాలి పాల్గొన్నారు.


ధూళిపాళ్ల భాగ్యనగర్ కాలనీ గృహ సందర్శనలో బృందం

ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియోచుక్కలు వేయాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : ఇంటింటికి తిరిగి చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని ఆరోగ్య సిబ్బందిని ప్రపంచ ఆరోగ్య సంస్థ పర్యవేక్షక బృంద వైద్యులు డాక్టర్ కోటేశ్వరరావు ఆదేశించారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల భాగ్యనగర్ కాలనీ, కళ్యం స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తున్న కార్మికుల గృహాలను డాక్టర్ కోటేశ్వరరావు వైద్యసిబ్బందితో కలిసి మంగళవారం సందర్శించారు. ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారా? లేదా? అనిపరిశీలించారు. ఆరోగ్య సిబ్బంది మూడవ రోజు కూడా ఇళ్లను సందర్శించి పోలియో చుక్కలను వేయించుకోని పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేయాలని, అన్ని గృహాల మీద మార్కింగ్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ప్రదీప్ , ఆరోగ్య విస్తరణాధికారి పి.శ్రీనివాసరావు, ఆరోగ్య సిబ్బంది సునీత, నటరాజ్, నవీన, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆక్రమ నిర్మాణాలంటూ ఫిర్యాదు

ప్రజాశక్తి - చిలకలూరిపేట : స్థానిక నరసరావుపేట రోడ్డులోని టిడిపి కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ స్థలంలో బి.సి సామాజికతరగతి కోసం 53 సెంట్లు భూమి, భవన నిర్మాణానికి కేటాయించారని, ఆ స్థలం ముందు కొంతమంది ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారని జాతీయ బీసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.పృథ్వీరాజు అన్నారు. దీనిపై వైసిపి నాయకులకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఆత్మీయ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, నరసరావుపేట వైసిపి ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త ఎం.రాజేష్‌నాయుడుకు వివరించారు.

రికార్డు స్థాయిలో కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు

ప్రజాశక్తి - నరసరావుపేట



ఆపరేషన్ ద్వారా వినికిడి శక్తి పొందిన చిన్నారులతో అంజిరెడ్డి హాస్పటల్ సిబ్బంది

పుట్టుకతో మూగ, చెవిటి పిల్లలకు ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా కాక్లియార్ ఇంప్లాంట్ సర్జరీలను పట్టణంలోని డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్‌లో ఒకేసారి 13 మంది పిల్లలకు చేశారు. ఇలా చేయడం రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ రికార్డు అని డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రముఖ రోబోటిక్ సర్జన్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. గత నెలలో 13 మంది పిల్లలకు జరిగిన సర్జరీలతో కలిపి ప్రముఖ కాక్లియర్ ఇంప్లాంట్ సర్జన్ డాక్టర్ రాజేష్ ఏపూరి 50 సర్జరీలు పూర్తి చేశారు. డాక్టర్ రాజేష్ వేపూరి మాట్లాడుతూ 12 గంటలు పట్టే ఒక్కో సర్జరీ ఒక గంటలో పూర్తి చేశామని, ఒక సర్జరీ నుంచి మొదలుకొని ఈ రోజు 50 మంది పిల్లలకు పూర్తిస్థాయిలో ఒక్క కాంప్లికేషన్ కూడా లేకుండా కాక్లియార్ ఇంప్లాంట్ సర్జరీలు చేశామని చెప్పారు. గత నెలలో సర్జరీ జరిగిన పిల్లలకు మంగళవారం వినికిడి పరీక్ష చేశామని, వారంతా మొట్టమొదటిగా వినగలుగుతున్నారని, త్వరలో స్విచ్ థెరపీకి పంపనున్నామని వివరించారు. ఇదిలా ఉండగా షుగర్ వ్యాధితో దీర్ఘకాలిక పుండ్లతో భరించలేని నొప్పితో బాధపడుతూ ఉన్న పేషెంట్‌కు ప్రముఖ ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శబరి గిరీష్ ఫెరిఫరల్ యాంజియోప్లాస్టి అనే విధానం ద్వారా కాళ్లలో ఉన్న 100 శాతం మూసుకుపోయిన రక్తనాళాలకు స్టంట్ అమర్చి రక్తనాళాలను తెలిసి రక్తం సరఫరా అయ్యే విధంగా అమర్చారని తెలిపారు. ఈ విధానం ద్వారా పేషెంట్‌కు దీర్ఘకాలిక పుండ్లు తగ్గిపోయి పూర్తిగా నొప్పి లేకుండా నయమైపోతుందన్నారు. ఇలాంటి కొత్త విధానం మొట్టమొదటిసారిగా తమ హాస్పిటల్‌లో నిర్వహించామని వివరించారు.

వారి పేర్లను ఓటర్ల జాబితాలో తొలగించండి

ప్రజాశక్తి - పెదకూరపాడు


శిక్షణకు హాజరైన బిఎల్వోలు, ఇతర అధికారులు

మరణించిన వారి పేర్లు, డబుల్ ఎంట్రీలను ఓటర్ల జాబితా నుండి తొలగించాలని బిఎల్వోలకు తహాశీల్దార్ జె.ప్రభాకర్‌రావు సూచించారు. పెదకూరపాడులో నియోజకవర్గస్థాయి బిఎల్‌ఓలకు వివిధ అంశాలపై మంగళవారం శిక్షణిచ్చారు. ఈవీఎంలు, హోమ్ ఓటింగ్, వికలాంగుల ఓట్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఓటర్ జాబితాలో తప్పులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అచ్చంపేట, అమరావతి, క్రోసూరు, తహాశీల్దార్లు, బిఎల్వోలు పాల్గొన్నారు.

విభేదాలను పక్కనపెట్టి పని చేయాలి

వైసిపి ఎంపీ అభ్యర్థి పరిచయ సభలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

ప్రజాశక్తి - చిలకలూరిపేట


అభివాదం చేస్తున్న రాజశేఖర్, రాజేష్‌నాయుడు, అనిల్‌కుమార్

నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ వైసిపి అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్ పరిచయ కార్యక్రమం స్థానిక పాత ప్రభుత్వాస్పత్రి వద్ద గల ఆర్యవైశ్య వెంకటేశ్వర కళ్యాణ మండపంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి వైసిపి చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త ఎం.రాజేష్‌నాయుడు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ వైసిపి పాలనలో 85 శాతం మంది ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని, ఇంత మేలు చేసిన ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తేవాలని అన్నారు. ఈ బాధ్యతను ప్రతి కార్యకర్త భుజాన వేసుకోవాలని కోరారు. ఎన్నికలకు 50 రోజులే ఉందని, చిన్నచిన్న విభేదాలున్నా వాటిని పక్కనపెట్టి కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ తాను రెండుసార్లు నెల్లూరు నుండి గెలిచానని, మూడోసారి పోటీకి ఏర్పాట్లు చేసుకుంటుండగా జగన్ ఆదేశాలతో మారు మాట్లాడకుండా ఇక్కడికి వచ్చానని చెప్పారు. తొలుత పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, సోమేపల్లి సాంబయ్య విగ్రహాలకు పూలమాలలేశారు.

ప్రజాధనాన్ని వైసిపి దుర్వినియోగం చేస్తోంది : ప్రత్తిపాటి

ప్రజాశక్తి - చిలకలూరిపేట


టిడిపిలో చేరినవారితో పత్తిపాటి పుల్లారావు

వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైసిపికి ఓటేస్తే వారి పిల్లల భవిష్యత్‌తోపాటు రాష్ట్ర భవిష్యత్‌ను నాశనం చేసినట్టేనని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు అన్నారు. స్థానిక పండరిపురంలోని తన నివాసంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రజాధనాన్ని వైసిపి దుర్వినియోగం చేస్తోందని, ప్రజల స్వేచ్ఛను హరిస్తోందని, మాట్లాడే హక్కును ప్రజలు కోల్పోయారని అన్నారు. దళితుల ఆస్తులను కొల్లగొట్టి వైసిపి నాయకులు పబ్బం గడుపుకుంటున్నారని దుయ్యబట్టారు. ఇదిలా ఉండగా మండలంలోని వేలూరు ఎస్సీ కాలనీకి చెందిన 40 కుటుంబాలు టిడిపిలో చేరగా వారిని పుల్లారావు ఆహ్వానించారు. వీరందరికీ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా స్థానిక కళ్యాణి సెంటర్‌లో ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ కొనసాగుతోంది. మంగళవారం 644 మందికి భోజనం సమకూర్చారు. కార్యక్రమంలో షేక్ కరీమ్, టి.సుభాని, టైలర్ ఖాజావలి, షేక్ అన్సర్, టి.శ్రీనివాసరావు, జె.బుచ్చిబాబు పాల్గొన్నారు.



జెడ్‌పి పాఠశాలకు పూర్వ విద్యార్థులు 12 ఫ్యాన్లు బహూకరణ

ప్రజాశక్తి - రొంపిచర్ల

మండల కేంద్రమైన రొంపిచర్లలోని జెడ్‌పి పాఠశాల మంగళవారం పూర్వ విద్యార్థులు రూ.17 వేలతో సమకూర్చిన 12 ఫ్యాన్లు బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం బియం సుభానీ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ప్రస్తుతం చదువుచున్న విద్యార్థులు పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకున్న తరువాత పాఠశాల అభివృద్ధికి సహకరించాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ టి.రామిరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, సైదయ్య, స్థానికులు ఎస్.రాంబాబు, వెంగళరాజు వెంకటసుబ్బరాజు, పూర్వ విద్యార్థులు హుస్సేన్, పి.వెంకట్, పి.నాగేశ్వరరావు, ఎస్.తిమ్మరాజు, కె.వెంకటేశ్వరరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

టిడిపి నాయకులు గోవిందరెడ్డి మృతి

ప్రజాశక్తి - రొంపిచర్ల

మండల కేంద్రమైన రొంపిచర్లకు చెందిన టిడిపి నాయకులు పల్లెల గోవిందరెడ్డి (56) మంగళవారం మృతి చెందారు. ఆయన కొద్ది రోజులుగా గుండెపోటుతో బాధపడుతూ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గోవిందరెడ్డి భౌతికకాయాన్ని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, నాయకులు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరాజు సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో వైసిపి మండల కన్వీనర్ కె.శ్రీనివాసరెడ్డి, నాయకులు పి.రవీంద్ర బాబు, టిడిపి మండల అధ్యక్షులు పి.జగ్గయ్య, నాయకులు పి.నాగిరెడ్డి, కె.మల్లారెడ్డి, ఎం.అంజయ్య, కె.నరసింహా రావు, ఎన్.శ్రీనివాసరావు, ఎం.వెంకటరత్నం ఉన్నారు.

రామ్మోహన్‌రావుకు నివాళులు

ప్రజాశక్తి - వినుకొండ

ఎన్‌ఎంయు వ్యవస్థాపకులు పి.రామ్‌మోహన్‌రావు 19వ వర్ధంతిని స్థానిక ఆర్‌టిసి డిపో ఎదురుగల ఎన్‌ఎంయు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి డిపో గౌరవాధ్యక్షులు ఆర్.శ్రీనివాసరావు పూలమాలలేశారు. అనంతరం జరిగిన సభకు డిపో కార్యదర్శి బి.శివప్రసాద్ నాయక్ అధ్యక్షత వహించగా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడారు. హనుమానాయక్, సౌభాగ్యరాజు, నీలిమ, వైయస్ రావు, కె.ఆర్. కె. రావు, రాఘవ, హనుమయ్య, మస్తాన్, ఆనందం పాల్గొన్నారు.



పంచాయతీల సమస్యలపై కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

వైసిపి ప్రభుత్వాన్ని ఓడించటంతోనే గ్రామ పంచాయతీలు అభివృద్ధి సాధ్యమని, రానున్న ఎన్నికల్లో వైసిపిని ఓడించాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వై.వి.బి. రాజేంద్రప్రసాద్ అన్నారు. పంచాయతీల సమస్యలపై మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్, సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా గ్రామాల అభివృద్ధిని నిర్వీర్యం చేసిందన్నారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులు దాదాపు రూ.8660 కోట్లు దారి మళ్లించారన్నారు. ప్రజలు గెలిపించిన సర్పంచ్‌లు నిధులు లేక ఉత్సవ విగ్రహాలుగా మారార న్నారు. రాష్ట్రంలోని 12,918 గ్రామాలలోని 3 కోట్ల 50 లక్షల మంది గ్రామీణ ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, కేంద్ర ప్రభుత్వ జల్ జీవన్ మిషన్ పథకాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు కేటాయించ కుండా అశ్రద్ధతో ఆ పథకాన్ని నీరుగార్చిందన్నారు. ఈ నేపథ్యంలో త్వరలో జరగబోయే ఎన్నికల్లో స్థానిక సంస్థల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా వైసిపి ప్రభుత్వాన్ని ఓడించడానికి తీవ్రంగా కృషి చేయాలని అన్ని పార్టీలకు చెందిన సర్పంచ్‌లకు, ఎంపిటిసిలు, జెడ్పీటిసిలకు పిలుపునిచ్చారు. ధర్నా అనంతరం డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీ ముత్యాల రావు, జిల్లా అధ్యక్షులు కల్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సర్పంచ్‌లు, అసోసియేషన్ నాయకులు

'జిజిహెచ్‌లో రోగుల ఆరోగ్య డేటా భద్రం'

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ద్వారా రోగి ఆరోగ్య వివరాలను పటిష్ఠ పరుస్తునట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం జనన మరణ ధ్రువీకరణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ కేంద్రం లోని మెడికల్ రికార్డ్స్ గదులను తనిఖీ చేసారు. అక్కడ నెలకున్న అపరిశుభ్రమైన వాతావరణం పై ఆయన అక్కడ సిబ్బంది కి పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రోగుల డేటా వివరాలను ఇక నుంచి పూర్తి స్థాయి లో పొందుపర్చేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఆసుపత్రి లోని ఎం ఆర్ డి కేంద్రాన్ని ఆధునీకరించడమే కాకుండా కంప్యూటీకరణ చేసి రోగుల సమాచారాన్ని పొందుపర్చ నున్నట్లు ఆయన చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రోగుల సమాచార వివరాలను పొందుపర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రిలో గత పదేళ్ల నుంచి మెడికల్ రికార్డు గదులలో కేసు షీటులు పేరుకుని పోయాయని దానివల్ల ఆ గదులలో వాసన రావడమే కాకుండా ఎలుకలు, బొద్దింకలు దూరి కేసు షీట్లను కోరుకుతున్నాయని ఆయన చెప్పారు. రోగి సంక్షిప సమాచారాన్ని పూర్తిగా కంప్యూటీకరణ చేయాల్సిందిగా ప్రైవేట్ సంస్థ గుత్తేదారునికి బాధ్యతలు అప్పగించిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని అయన అన్నారు. దానివల్ల గదులలో గుట్టలు గుట్టలుగా కేష్‌షీటులు పేరుకుని పోయాయని ఆయన అన్నారు. ఈ కేసు షీట్ల పై చెదలు చేరి ఇబ్బందిగా మారిందని దానికితోడు బొద్దింకలు, ఎలుకలు కూడా తిరగడం వున్న రికార్డులు కనుమరుగు అయ్యే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేసారు. రోగి డేటా ను పూర్తి గా కంప్యూటరీకరణ చేపట్టాలని అన్ని డాక్యుమెంట్ల ను స్కాన్ చేసి భద్రపర్చాలని గుత్తేదారునికి నోటీసులు ఇవ్వాలని సంబంధిత అధికారి సివిల్ సర్జన్ ఆర్ ఎం ఓ కు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన చెప్పారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు పెడుతున్నాదని ఆయన అన్నారు. ప్రతి రోగి ఆరోగ్య సమాచారాన్ని కంప్యూటీకరణ చేయడం వల్ల ఏ దేశం వెళ్లిన , రాష్ట్రము లో ఎక్కడికి వెళ్లిన రోగికి కేటాయించిన అభా నెంబర్ ద్వారా వైద్యులు వెంటనే వైద్యం అందించేందుకు తోడ్పడుతుందని ఆయన తెలిపారు. దీని వల్ల రోగికి తగు సమయం లో వైద్యం అందించేందుకు వీలు కలుగుతుందని ఆయన తెలిపారు.

అంతర్జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

"ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ ఆపర్చునిటీస్ ఇన్ హెల్త్ కేర్ మేనేజ్మెంట్" అనే అంశముపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు బ్రోచర్ ను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పి రాజశేఖర్ మంగళ వారం ఆవిష్కరించారు. యుజిసి సౌజన్యముతో డాక్టర్ వైయస్సార్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లు సంయుక్తంగా మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్ బట్టు నాగరాజు తెలిపారు. డిపార్ట్మెంట్ ఆఫ్ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ నిర్వహిస్తున్న ఈ కాన్ఫరెన్స్ కు బ్రోచర్ విడుదల సందర్భంగా విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య పి .రాజశేఖర్ మాట్లాడుతూ ఈ కాన్ఫరెన్స్ కి దేశ విదేశాల నుంచి వైద్య విజ్ఞాన పరంగా నిష్ణాతులు అనేకమంది వచ్చి వారి వారి యొక్క ప్రతిభా పాట వాళ్లను తమ లెక్చర్స్ ద్వారా ఇస్తారని తెలియ జేశారు. ఇథియోపియా నుంచి ప్రొఫెసర్ గులంబే, యుఎస్ఏ నుంచి డాక్టర్ స్నేహ మొదలగువారు ఈ కాన్ఫరెన్స్ లో ప్రసంగిస్తారు. ప్రొఫెసర్ కే. బాబ్జి వైస్ ఛాన్సర్ డాక్టర్ వైయస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ముఖ్యఅతిథిగానూ, తిరుపతి లో ఉన్న స్విమ్స్ వైస్ ఛాన్సర్ అండ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. వి. కుమార్, విశిష్ట అతిథిగానూ వస్తున్నారు. ప్రొఫెసర్ ఎం. విష్ణువర్ధన్ రావు, (డైరెక్టర్ ఐ సి ఎం ఆర్ నిమ్స్ న్యూఢిల్లీ) కీలక ఉపన్యాసం చేయనున్నారు . ప్రముఖ కార్డియో సర్జన్ డాక్టర్ సి. ప్రభాకర్ రెడ్డి (కర్నూల్ మెడికల్ కాలేజ్,) జేఎస్ఎస్ మెడికల్ కాలేజీ మైసూర్ నుంచి డాక్టర్ శ్యాం ప్రసాద్ శెట్టి మొదలగువారు ఈ కాన్ఫరెన్స్ లో ముఖ్య ఉపన్యాసాలు ఇవ్వనున్నారు. బ్రోచర్ రిలీజ్ కార్యక్రమ%శీ%లో రెక్టార్ ప్రొఫెసర్ పి. వరప్రసాద మూర్తి, రిజిస్ట్రా)ర్ ప్రోఫెసర్ కరుణ , ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్ స్వరూప రాణి, అధ్యాపకులు డాక్టర్ చుండి ప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ డేవిడ్ రాజు, హిందూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్వి రమణ పాల్గొన్నారు.

సచివాలయాన్ని తనఖా పెట్టడం దారుణం : దగ్గుబాటి పురంధేశ్వరి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సచివాలయాన్ని తనఖా పెట్టే అధికారం వైసిపి ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురంధేశ్వరి ప్రశ్నించారు. రాజధాని అమరావతిని నిర్వీర్యం చేసిన వైసిపి ప్రభుత్వం గతంలో నిర్మించిన భవనాలను తనఖా పెట్టి రుణాలు పొందడం దారుణం అన్నారు. గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞానమందిరంలో మంగళవారం సాయంత్రం జరిగిన 'ప్రజాపోరు' బహిరంగ సభ లో ఆమె పాల్గొన్నారు. సభకు ప్రజాపోరు గుంటూరు పార్లమెంట్ కన్వీనర్ మకుటం శివ అధ్యక్షత వహించారు. జగన్మోహనరెడ్డి రూ.12 లక్షల కోట్ల అప్పుతో ప్రజలను భస్మం చేశాడని, అతను రాష్ట్రానికి ఏమి చేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏది కనబడ్డా తాకట్టు పెట్టి, కోట్లాది రూపాయల అప్పు తెస్తూ, ప్రజలపై పెనుభారాన్ని జగన్ మోపుతున్నాడన్నారు. రాష్ట్రంలో నాణ్యత లేని మద్యాన్ని ఏరులై పారిస్తూ, ప్రజారోగ్యంతో చెలగాటమాడుతూ, జేబులు నింపుకుంటున్నాడన్నారు. గత అయిదేళ్లలో మహిళలపై దురాచారాలు పెరిగిపోయాయన్నారు. దిశ యాప్ ప్రవేశపెట్టామంటున్న వైసిపి ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఇంటికి కూతవేటు దూరంలో ఎస్సీ మహిళపై అత్యాచారం చేసి హత్య చేస్తే, తన కుటుంబానికి న్యాయం చేయలేక పోయిందని విమర్శించారు. రైతులకు జల్ జీవన్ మిషన్ కింద కేంద్రం వేలాది కోట్ల రూపాయలు రాష్ట్రానికి ఇస్తే, గుంటూరులో కనీసం శుద్ధమైన తాగునీరు కూడా అందించలేకపోతోందన్నారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణు వర్ధన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర, నాయకులు చందు సాంబశివరావు, జూపూడి రంగరాజు, యడ్లపాటి రఘునాదబాబు, వల్లూరు జయప్రకాష్ నారాయణ, శనక్కాయల ఉమాశంకర్, పాతూరి నాగభూషణం, తులసి రామచంద్ర ప్రభు, శనక్కాయల అరుణ, మట్టా ప్రసాదు, ఈదర శ్రీనివాసరెడ్డి, పాటిబండ్ల రామకృష్ణ, స్వరూపరాణి, భీమినేని చంద్రశేఖర్, తోట రామకృష్ణ పాల్గొన్నారు.



అన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధి సాధించాలి

చేబ్రోలులో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - చేబ్రోలు

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినప్పుడే నిజమైన అభివృద్ధి జరిగినట్లని మండల పరిషత్ అధ్యక్షురాలు కొక్కిలిగడ్డ సాహితీ కిరణ్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను చేబ్రోలు ఎంపిపి సమావేశం మందిరంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా హాజరైన సాహితీ కిరణ్ మాట్లాడుతు ప్రభుత్వం మహిళలకు అనేక రక్షణ చట్టాలను అమలు చేస్తుం దన్నారు. ప్రస్తుతం పురుషుల ఆధిక్యత భావం చాలా వరకు తగ్గిందని అన్నారు. ప్రతి మహిళ తన కుటుంబాన్ని సమర్ధవంతంగా చూసుకుంటూ సామాజిక కార్యక్రమాలు చురుగ్గా పాల్గొనడం జరుగుతుందని అన్నారు. మండలంలో ప్రథమ పౌరులుగా మండల పరిషత్ అధ్యక్షులు, జడ్పిటిసి సభ్యులు, మరియు చేబ్రోలు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, తహసిల్దార్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి మరి మండలంలో అనేక శాఖలలో ప్రజాప్రతినిధులుగా మహిళలు ఉండటం సంతోషించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో సిడిపిఒ వెంకటరమణ, తహశీల్దార్ ఇ రమాదేవి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ జి శ్రీనివాసరావు, చేబ్రోలు సర్పంచ్ పి వినితా రాణి, ఎఒ ఉమాదేవి, అంగన్వాడీలు తదితరులు పాల్గొన్నారు.




డ్రెయిన్ పూడిక పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక తదితరులు

వార్డుల్లో పారిశుధ్యం పరిశీలన

ప్రజాశక్తి - తెనాలి :వార్డుల పర్యటనలో భాగంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మంగళవారం పట్టణంలోని మూడో వార్డులో పర్యటించారు. వార్డులో ప్రజల ద్వారా సమస్యలు తెలుసుకున్నారు. వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించి, డ్రెయిన్లు పూడిక తీయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి నుండి, వ్యాపార కూడళ్ళ నుంచి వెలువడే వ్యర్థాలను సైడ్ డ్రెయిన్లలో వేయరాదన్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి డస్ట్ బిన్ల ద్వారా చెత్త సేకరణ వాహనాలకు అందించాలన్నారు. అలాకాకుండా కాలువల్లో వేయడం ద్వారా అవి పూడుకుపోయి, మురుగు పారుదల సమస్య తలెత్తుతుందన్నారు. శానిటేషన్ మెరుగుపరిచే కార్యక్రమాలకు ప్రజలు తమ వంతుగా సహకరించాలన్నారు. ఆమె వెంట ఎం హెచ్ ఓ డాక్టర్ కె హెలెన్ నిర్మల, శానిటరీ ఇనస్పెక్టర్లు ఎ రామచంద్రరావు, డి శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, మాజీ కౌన్సిలర్ టి రమేష్, నాయకులు కొమ్ము రాయల్ ఉన్నారు.


బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితరులు

16 నుండి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో 16వ తేదీ నుండి 27వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం దేవస్థానం దిగువ సన్నిధిలో ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు తహశీల్దార్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతు 24వ తేదీ రాత్రి జరిగే కళ్యాణోత్సవానికి, 25న రథోత్సవానికి వచ్చే యాత్రికు లకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు మాట్లాడారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఏ రామకోటి రెడ్డి, డాక్టర్ అనూష, కార్పొరేషన్ ఇంజనీర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



ఎంఎస్‌ఎంఇ స్కీంపై శిక్షణా తరగతులు

ప్రజాశక్తి మంగళగిరి

కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో రూపొందించబడిన ఎంఎస్ ఎంఈ స్కీమ్ కు సంబందించిన విధివిధానాలు, లబ్ధిదారుల ఎంపిక మంగళవారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, వార్డ్ ఏమినితీశ్ సెక్రటరీలకు శిక్షణా తరగతులు జరిగాయి. ప్రభుత్వం రూపొందించిన ఎం ఎస్ ఎంఈ అప్లికేషన్ పనితీరు, వినియోగం గురించి బోధించారు. జిల్లా పరిశ్రమల విభాగం జనరల్ డైరెక్టర్ ఎం మోహన్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమములో డిప్యూటీ కమీషనర్ బి. శివారెడ్డి, నగరపాలక సంస్థ పరిధిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ మరియు వార్డు ఏమినిటీస్ సెక్రెటరీలు పాల్గొన్నారు.

సెయింట్ లారెల్స్ స్కూల్లో సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఆర్టీసి కాలనీలోని సెయింట్ లారెల్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్లో వరల్డ్ సస్టైనబుల్ ఎనర్జీ డే సందర్భంగా సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌కు గుంటూరు ఎంఇఒ వెంకటేశ్వరరావు, తేజ స్కూల్ డైరెక్టర్ సురేష్, ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ గుంటూరు ఈస్ట్ ప్రెసిడెంట్ భానుప్రసాద్, గుంటూరు వెస్ట్ ప్రెసిడెంట్ నర్రా రాజేష్, కలాం తెరిసా డైరెక్టర్ మస్తాన్, సుజాత స్కూల్ డైరెక్టర్ ఆదిత్య తదితరులు హాజరయ్యారు. విద్యార్థులు దాదాపు 250 ప్రాజెక్టులను ప్రదర్శిం చారు. ప్రపంచ సుస్థిర శక్తి దినోత్సవాన్ని సూచిస్తూ సోలార్ ఎనర్జీ, విండ్ ఎనర్జీ, ఎలక్ట్రికల్ ఎనర్జీ, న్యూక్లియర్ ఎనర్జీ తదితర ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఇస్రో రాకెట్ లాంచింగ్ సెంటర్, ఇంక్రిడబుల్ ఇండియా, హ్యూమన్ రీ ప్రొడక్టివ్ సిస్టం, డ్రిడ్ ఇరిగేషన్, పోలింగ్ బూత్, హోలోగ్రామ్, ఫైర్ అలారం తదితర ప్రాజెక్టులూ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ఆసక్తి, పట్టు దల వారి ప్రాజెక్టుల ద్వారా తెలియజేశారు.స్కూల్ కరస్పాండెంట్ మేకల రవీంద్రబాబు, స్కూల్ డైరెక్టర్ మేకల శేషకుమారి, సాయి శ్రీకర్, హెచ్ఎం మీనాక్షి, ప్రిన్సిపాల్ కళ్యాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పన్నుపై వడ్డీ రాయతీకి 3 వారాలే గడువు : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రప్రభుత్వం పన్ను బకాయి అంతా ఏక మొత్తంగా చెల్లించిన వారికి కల్పించిన వడ్డీ రాయితీ గడువు మరో 3 వారాలు మాత్రమే ఉంటుందని, నగరంలోని పన్ను బకాయిదార్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలియచేశారు. రాష్ట్ర ప్రభుత్వం పన్ను బకాయి అంతా ఏక మొత్తంగా చెల్లించిన వారికి వడ్డీ రాయితీ ప్రకటించిందని, నగర పజలు ఈ నెలాఖరులోపు తమ ఆస్తి, ఖాళీస్థల పన్నులు పూర్తిగా చెల్లించి వడ్డీ రాయితిని పొందాలని తెలిపారు. ఏప్రిల్ 1నుండి పన్నుపై వడ్డీ యధావిధిగా ఉంటుందన్నారు. ఇతర రాష్ట్రాలు, దేశాల్లో నివశించే యజమానులు కూడా వడ్డీ మినహాయింపు అవకాశాన్ని తెలియ చేయాలని అడ్మిన్ కార్యదర్శులను ఆదేశించామన్నారు. పన్ను చెల్లింపుదార్లకు వీలుగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లోని క్యాష్ కౌంటర్లతో పాటు, భారత్‌పేటలోని 140, పెద్దపలకలూరు రోడ్డులోని 106, వసంతరాయపురం మెయిన్ రోడ్డులోని 148 వార్డు సచివాలయాల్లో కూడా క్యాష్ కౌంటర్లు పనిచేస్తాయన్నారు. కావున జిఎంసికి చెల్లించాల్సిన ఆస్తిపన్ను, నీటిపన్ను, ఖాళీ స్థలం పన్ను, నీటి మీటర్ చార్జీలు, డిఅండ్ఓ ట్రేడ్ లైసెన్స్‌లు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.



విద్యార్థినిని అభినందిస్తున్న కరస్పాండెంట్ , ప్రిన్సిపల్ తదితరులు

పవర్ లిఫ్టింగ్‌లో చలమయ్య కాలేజీ విద్యార్థినికి గోల్డ్‌మెడల్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కాలేజి విద్యార్థిని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన అంతర కళాశాలల పవర్‌లిఫ్టింగ్ పోటీలో అత్యంత ప్రతిభ కనబరిచిందని కళాశాల ప్రిన్సిపాల్ యం.శ్రీనివాసరావు తెలిపారు. 76 కెజిల విభాగంలో బికాం మొదటి సంవత్సరం చదువుతున్న టి.నాగజ్యోతి గోల్డ్‌మెడల్ సాధించిందని, ఆలిండియా సెలక్షన్‌కు అర్హత సాధించిందని, స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ఆచార్య నాగార్జునా యూనివర్సిటీగా ఎన్నికైందన్నారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో విద్యార్థినిని కళాశాల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణప్రభు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, జూనియర్ కాలేజి ఇన్‌చార్జి సుభద్ర, ఇంగ్లీషు మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ అరుణకుమారి, కల్చరల్ కోఆర్డినేటర్ మధుసూదన్, చైతన్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది

హత్యకు గురైన నాలాది సాంబశివరావు కుటుంబ సభ్యులతో కలెక్టర్ సమావేశం

ప్రజాశక్తి-గుంటూరు



సాంబశివరావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

కొల్లిపర మండలం, తూములూరు గ్రామంలో ఫిబ్రవరి 26వ తేదిన హత్యకు గురైన ఎస్సీ యువకుడు నాలాది సాంబశివరావు కుటుంబ సభ్యులతో మంగళవారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మృతుని తల్లి నాలాది విశ్రాంతమ్మ, సోదరుడు మునికుమార్, అక్క లావణ్యను పరామర్శించి, ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని అధైర్యపడవద్దన్నారు. నిందితులకు చట్టప్రకారం కఠిన శిక్షలు అమలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం తరుపున చట్టప్రకారం రిలీఫ్ బెనిఫిట్స్‌ను సత్వరమే అందించటం జరుగుతుందని హామీ ఇచ్చారు. మతుని కుటుంబ సభ్యులకు మానిటరీ రిలీఫ్ రూ.8,25,000లలో మొదటి విడతగా 50శాతం రూ.4,12,500లను మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్వర్వులు జారీ చేశారు. మానిటరీ రిలీఫ్ రెండవ విడత 50శాతం చార్జిషీటు దాఖలు చెయ్యగానే మంజూరు చేయటం జరుగుతుందన్నారు. అదేవిధంగా కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, మతుని తల్లికి పెన్షన్, ఇతర ప్రయోజనాలను అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకులు మధుసూదన రావు పాల్గొన్నారు.

8న కళా జాగరణ సాంస్కృతిక ఉత్సవం

ప్రజాశక్తి-తాడేపల్లి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళా జాగరణ నిర్వాహకులు

ప్రజా కళలకు పుట్టినిల్లుగా నిలిచిన కళల కాణాచి తాడేపల్లిలో మహాశివరాత్రి సందర్భంగా జరిగే సాంస్కృతిక ఉత్సవాలను జయప్రదం చేయాలని తాడేపల్లి విజ్ఞాన కేంద్రం, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి, కాన్ఫడరేషన్ ఆఫ్ అపార్ట్‌మెంట్స్ తాడేపల్లి నిర్వాహకులు, ప్రముఖ జర్నలిస్టులు కోరారు. మంగళవారం తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో కళా జాగరణ పోస్టర్‌ను నిర్వాహకులు ఆవిష్కరిం చారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ తాడేపల్లిలో మొట్టమొదటి సారిగా ఈ నెల 8వ తేదీ శివరాత్రి సందర్భంగా సాయంత్రం ఆరు గంటల నుంచిగణేష్ కళా మందిరం వద్ద ఏర్పాటు చేసిన కళా వేదికపై జానపద నృత్యాలు, కోలాటాలు, కూచిపూడి, వెస్టరన్, పాటలు, పద్యాలు, ఏకపాత్రలు, అభ్యుదయ గీతాలు ప్రదర్శింపబడతాయని తెలిపారు. ప్రజలే నిజవీరులు... ప్రజలే నిర్మాతలు... ప్రజలను మించిన వీరులు మహాపురుషులు ఎవరూ లేరని వెల్లడించారు. ప్రజా సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. సంస్కృతి సంప్రదాయాలు కనుమరుగవ్వడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని చెప్పారు. ప్రస్తుతం చిన్న పిల్లల దగ్గర నుంచి పెద్దల వరకు సెల్‌ఫోన్‌కు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాల్లో సంప్రదాయ కళలైన చెక్కభజనలు, తోలుబొమ్మలాట, బుడబుక్కల వేషాలు, కష్టజీవులు తమ కష్టాన్ని మరిచిపోయే విధంగా ఆలపించే జానపద గీతాలు ప్రజల ముందుకు రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. అందులో భాగంగానే మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన కళా జాగరణ సాంస్కృతిక ఉత్సవాల్లో శ్రీ నాట్యతరంగిణి కూచిపూడి డాన్స్ ఇన్స్టిట్యూట్ నాట్యాచారిణి అనూషనాయుడు, భారతి నృత్యాలయం నాట్యాచారిణి పద్మశ్రీ హేమంత్‌కుమార్, సిరిమువ్వ నృత్యానికేతన్ నాట్యాచారిణి ఉషామాధవి, ప్రగతి బాల విద్యాలయం, ప్రతిభ హైస్కూల్, రవీంద్ర భారతి హైస్కూల్ విద్యార్థులతో నృత్య ప్రదర్శనలు, కోలాట గురువు దాలియ మహిళా బృందంచే కోలాట ప్రదర్శనలు, ప్రముఖ ఇంద్రజాలకులు ఆర్.ఆదినారాయణ ఇంద్రజాల ప్రదర్శనలు ఉంటాయని, అందరూ ఆహ్వానితులేనని తెలిపారు. ఈ సమావేశంలో తాడేపల్లి విజ్ఞాన కేంద్రం గాదె సుబ్బారెడ్డి, రచయిత, ప్రముఖ పాత్రికేయులు ఎస్.వెంకట్రావు, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు ఆర్‌పిఎం పరుచూరి కిరణ్, యార్లగడ్డ సుబ్బారావు, కె.శేషయ్య, కొట్టె కరుణాకరరావు, పి.శ్రీలక్ష్మి, డి.కోదండరామయ్య పాల్గొన్నారు.

వర్సిటీలో ఘనంగా మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - ఎఎన్‌యు



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లోని గానగంధర్వ డాక్టర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం స్కూల్ ఆఫ్ పెర్ఫార్మెన్స్ అండ్ ఫైన్ ఆర్ట్స్‌లో థియేటర్స్ సినిమా టీవీ విభాగం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మంగళ వారం వివిధ శాఖలకు చెందిన మహిళా కళాకారులు, విద్యార్థులు, అధ్యాపకులు సిబ్బందిని సన్మానించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి . హెచ్.స్వరూప రాణి హాజర య్యారు. ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం అనేది ప్రపంచంలో నలుమూలలలో ఉన్న మహిళా లోకానికి వివిధ అంశాల మీద సందేశాన్ని అందించుకుంటూ మహిళా సాధికారతకు ప్రోత్సాహం ఇస్తూ, వివిధ రంగాల్లోని మహిళలను ప్రోత్సహించడానికి వారికి కావాల్సిన సహాయక సహకారాలు అందించడానికి యావత్ ప్రపంచం తోడ్పాటు అందిస్తోందని తెలియజేశారు. అణగారిన బడుగు వర్గాల మహిళల సైతం వారి వారి శక్తి సామర్థ్యాలను తెలుసుకొని వినియోగించుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా పురుషాధిక్య ప్రపంచం స్త్రీ యొక్క మనుగడకి అడ్డంకిగా నిలిచేటువంటి పరిస్థితులు మారాలని కోరారు. విశ్వవిద్యాలయంలోని అధ్యాపక, అద్యాపకేతర, మహిళ సిబ్బంది వారి వారి రంగాల్లో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ కొండలరావు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు సహకారాలు అందించాలన్నారు. విశ్వవిద్యాలయ పర్ఫామింగ్ ఆర్ట్స్ డిపార్ట్మెంట్ నందిని పలువురు మహిళలు మాట్లాడుతూ వారి అనుభవాలను తెలియజేస్తూ మిగతా వారికి స్ఫూర్తిని అందించారు. కార్యక్రమంలో నృత్య శాఖ అధిపతి డాక్టర్ సుతకీర్తి సంగీత, శాఖ అధిపతి డాక్టర్ మంజుల, పావని ఇతర అధ్యాపకులు, హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి పర్ఫామెన్స్ విభాగం హనరరీ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్వి భూషణ్ అధ్యక్షత వహించారు.

పరిశోధనలు, అభివృద్ధిపై పెట్టుబడి పెట్టండి

విజ్ఞాన్స్‌లో అంతర్జాతీయ వర్క్‌షాప్‌లో డాక్టర్ సుధాకర్‌రావ్

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న సుధాకర్‌రావు

విద్యార్థులందరూ పరిశోధనలు, అభివద్ధిపై పెట్టుబడిపెట్టాలని యూఎస్‌ఏలోని డబ్ల్యూఏఎమ్ఎస్ లైట్ ఫెల్లో ప్రెసిడెంట్ అండ్ సీఈవో, ఐఈఈఈ లైఫ్‌ఫెల్లో డాక్టర్ సుధాకర్‌రావ్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఈసీఈ ఆధ్వర్యంలో 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ ఫండమెంటల్స్, అనాలిసిస్, డిజైన్, ఫ్యాబ్రికేషన్ అండ్ టెస్ట్ ఆఫ్ అడ్వాన్స్డ్ యాంటినాస్ ఫర్ స్పేస్, ఏయిర్ అండ్ గ్రౌండ్ అప్లికేషన్స్' అనే అంశంపై అంతర్జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సుధాకర్‌రావ్ మాట్లాడుతూ ఆవిష్కరణ అనేది ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు రోజువారి దినచర్యగా ఉండాలన్నారు. ఇంజినీరింగ్ విద్యను అభ్యసించే ప్రతి విద్యార్థికి లెర్నింగ్, అప్లై, డెవలప్, ఇన్నోవేట్, లీడ్ చేసేటటు వంటి ఐదు గుణాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. సిస్టమ్స్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, మెకానికల్, టెస్ట్ అండ్ కస్టమర్ అండర్ స్టాడింగ్ వంటి క్రిటికల్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలన్నారు. అవుట్‌సైడ్ ఆఫ్ ద బాక్స్ ఆలోచించి కాన్సెప్ట్‌లను డెవలప్ చేయాలన్నారు. ప్రాథమిక అంశాలను క్షుణ్ణంగా అర్థం చేసుకుని వాటిని సమస్యలకు అన్వయించి ఫలితాలను రాబట్టాలన్నారు. పులివెందులలోని జేఎన్‌టీయూ వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రమణారెడ్డి మాట్లాడుతూ ఎప్పుడూ ఒకే విధంగా మూస ధోరణిలో పనులు చేసుకుంటూ వెళితే కొన్నాళ్లకే విద్యార్థులకు బోరు కొట్టేస్తుందని, పరిధిని దాటి సులువైన పద్ధతుల కోసం ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో యూఎస్‌ఏలోని నాసా/జేపీఎల్ సీనియర్ ఇంజినీర్ డాక్టర్ నాసెర్ చహత్, యూఎస్‌ఏలోని నాసా/జేపీల్ యాంటీనా ఇంజినీర్ డాక్టర్ గౌరాంగిగుప్త, విజ్ఞాన్స్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చిలువూరులో దుగ్గిరాల మండలం బాలోత్సవం

ప్రజాశక్తి దుగ్గిరాల : మండలంలోని చిలువూరు గ్రామంలో ఉన్న కె వి ఎస్ హై స్కూల్ లో బుధవారం జరుగునున్న బాలోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు 33 పాఠశాలలకు చెందిన 900 మంది విద్యార్థినీ విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకున్నట్లు బాలోత్సవ సమన్వ యకర్త పిన్నమనేని మురళీకృష్ణ తెలిపారు. పాఠశాల ఆవరణలో నాలుగు సాంస్కృతిక వేదికలు ఐదు ఎకడమిక్ వేదికలు సిద్ధం చేస్తున్నారు. 36 అంశాలలో వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.